మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ
# డ్రీమ్ టైమ్స్
తెలుగు దిన పత్రిక
శనివారం 13-06-2026
పేజీలు: 8 వెల: రూ.2/-
సంపుటి:5 సంచిక 219
Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District

విలేకరులు కావలెను




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609




## పెట్రోల్ బంకుల వద్ద భారీ డీజిల్ కొనుగోళ్లకు బ్రేక్

- ఒక్కో వాహనానికి 200 లీటర్లకే పరిమితి
- పరిశ్రమలు ప్రత్యేక సరఫరా వ్యవస్థల నుంచే కొనుగోళ్లు
- 90 రోజుల పాటు అమల్లో కేంద్ర ఆంక్షలు
- పెట్రోల్ బంకులపై ఆంక్షలు విధించిన కేంద్రం

3

పశ్చిమ ఆసియా ఉద్రిక్తతలతో ఇంధన సరఫరాపై ఒత్తిడి పెరగడంతో కేంద్రం కఠిన చర్యలకు దిగింది. పెట్రోల్ బంకుల వద్ద భారీ స్థాయిలో డీజిల్ కొనుగోళ్లకు బ్రేక్ వేస్తూ, ఒక్కో వాహనానికి రోజుకు 200 లీటర్ల పరిమితి విధించింది. రిశ్రమలు, వాణిజ్య వినియోగదారులు ప్రత్యేక సరఫరా వ్యవస్థల నుంచే ఇంధనం కొనుగోలు చేయాలని ఆదేశిస్తూ, ఈ ఆంక్షలను 90 రోజుల పాటు అమలు చేయనుంది.



## భారత నౌకలపై దాడి చేసింది ఇరాన్..

- హార్ముజ్ జలసంధి ఘటనపై ఖండన వ్యక్తం చేసిన డొనాల్డ్ ట్రంప్
- ఇరాన్ డ్రోన్లతోనే దాడులు జరిగాయని 'ట్రూత్' వేదికగా వెల్లడి
- అమెరికాపై ఇరాన్ చేస్తోన్న తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టిన ట్రంప్
- గతంలో భారత నౌకలపై జరిగిన దాడుల్లో ముగ్గురు మృతి, 21 మంది క్షేమం
- అమెరికానే దాడి చేసిందన్న ప్రచారానికి చెక్ పెడుతూ ఇరాన్ వైఖరిని తప్పుబట్టిన అమెరికా అధ్యక్షుడు

న్యూఢిల్లీ,
: హార్ముజ్ జలసంధి వద్ద భారత నౌకలపై దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ దాడి ఇరాన్ పనే అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. భారత నౌకలపై ఇరాన్ డ్రోన్లతో దాడి చేసిందని, ఈ దాడి ఆమోదయోగ్యం కాదని ట్రంప్ అన్నారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ట్రూత్ వేదికగా శుక్రవారం స్పందించారు. ఇంతవరకు భారత నౌకలపై దాడి చేసింది అమెరికానే అని ప్రచారం జరిగింది.దీనిపై ఇటు అమెరికా, అటు ఇరాన్ అధికారికంగా స్పందించలేదు. కానీ, తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. గత రాత్రి భారత నౌకపై జరిగిన ఈ దాడికి కారణం ఇరాన్ అన్నారు. ఇరాన్ డ్రోన్లతో దాడి చేసిందని, ఈ దాడిని ట్రంప్ ఖండించారు. మరోవైపు అమెరికాతో ఒప్పందం కుదిరిందని ఇరాన్ తప్పుడు ప్రచారం చేస్తోందని ట్రంప్ విమర్శించారు. ఈ విషయంలో ఇరాన్ తన వైఖరి మార్చుకోవాలని సూచించారు. భారత వాణిజ్య నౌకలపై జరిగిన దాడిలో 21 మందిని సహాయక బృందాలు రక్షించగా, ముగ్గురు మరణించారు. రెండుసార్లు భారత నౌకలపై దాడి జరిగింది. ఈ దాడికి కారణం అమెరికానే అని భావించిన భారత ప్రభుత్వం అమెరికా రాయబారికి సమన్లు జారీ చేసింది. అది కూడా రెండుసార్లు సమన్లు ఇచ్చింది. ఇదే సమయంలో ట్రంప్ స్పందించడం ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఇరాన్, అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై అమెరికా దాడి చేస్తోంది. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడి చేస్తోంది. హార్ముజ్ జలసంధి వద్ద చిక్కుకుపోయిన నౌకలపై జూన్ 8న తొలిసారి దాడి జరిగింది. ఆ తర్వాత గురువారం మరోసారి దాడి జరిగింది. ఈ దాడులు అమెరికానే చేసిందనే ప్రచారం మొదలైంది.


## స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నాం

సంపద సృష్టిస్తేనే సంక్షేమం గురించి చెప్పాలి



- ఆదాయాన్ని పెంచేవాళ్లకే సంక్షేమం పంచే అధికారం
- తాకట్టు పెట్టే వాళ్లకు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదు
- వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చిన కేంద్రం
- పోలవరం, అమరావతి,రైల్వేజోన్ తదితర ప్రాజెక్టులకు చేయూత
- జగన్ విధ్వంసంతో రాష్ట్రం అధోగతి పాలయ్యింది
- రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమంపై తిరుపతి సభలో చంద్రబాబు

తిరుపతి జూన్ 12(డ్రీమ్ టైమ్స్):
స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. హామీల అమలుతో నిజాయితీ నిరూపించుకుంటున్నామని తెలిపారు. సంపద సృష్టిస్తేనే సంక్షేమం గురించి చెప్పాలి.. ఆదాయాన్ని పెంచేవాళ్లకే సంక్షేమం పంచే అధికారం ఉంటుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. అన్నీ తాకట్టు పెట్టే వాళ్లకు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో ఎమ్మార్వో ఆఫీసు, ఆసుపత్రులను కూడా తాకట్టు పెట్టారని గుర్తు చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' పేరుతో తిరుపతి సమీపంలోని దామినేడులో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు, -మిగతా 3 లో





## రాష్ట్రవ్యాప్తంగా మోగిన బడి గంట

- వేసవి సెలవుల అనంతరం తెరుచుకున్న పాఠశాలలు
- తొలిరోజు పండుగ వాతావరణంలో బడులకు పిల్లల హాజరు
- కొత్తగా బడికి వచ్చిన చిన్నారులకు చాక్లెట్లు పంచిన టీచర్లు
- మంత్రి లోకేష్ శుభాకాంక్షలు

న్యూఢిల్లీ :జూన్ 12(డ్రీమ్ టైమ్స్):
వేసవి సెలవుల అనంతరం కొత్త విద్యా సంవత్సరం మొదలైంది. తొలిరోజు పండుగ వాతావరణంలో పాఠశాలలు తెరుచుకున్నాయి. విద్యార్థులు పెద్ద సంఖ్యలో బడులకు హాజరయ్యారు. టీచర్లు వారిని ఆప్యాయంగా ఆహ్వానించారు.వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు నేడు పునఃప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వద్ద సందడి నెలకొంది. 2026 - 27 విద్యా సంవత్సరం తొలిరోజే, బడులకు పిల్లలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కర్నూలులో కొత్తగా బడికి వచ్చిన చిన్నారులను ఉపాధ్యాయులు ఆటపాటలతో ఆహ్వానించారు. నంద్యాల ఆర్టీసీ స్టాండ్ సమీపాన ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పునఃప్రారంభం పండుగ వాతావరణంలో జరిగింది. నంద్యాలకు చెందిన సేవా సంస్థ 'మన ఊరు - మన బడి - మన బాధ్యత' పేరిట బాలికలకు స్వాగతం పలికింది. డ్రమ్ములు వాయిస్తూ విద్యార్థులతో కలిసి టీచర్లు నృత్యం చేశారు.

-మిగతా 3 లో

## ప్రజలు అధికారంతో పాటు .. అతి పెద్ద బాధ్యత అప్పగించారు

- ప్రజలు ఇచ్చిన తీర్పుతో రాష్ట్ర భవిష్యత్‌కు కొత్త దిశ
- గ్రామాల అభివృద్ధితోనే దేశం బలపడుతుంది
- సమస్యలు గ్రామస్థాయిలోనే పరిష్కారం కావడం మేలు
- సమిష్టి కృషితోనే విశాఖ ఉక్కును కాపాడుకోగలిగాం
- యువత ఆశయాలు, అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి
- రెండేళ్ల విజయోత్సవంలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్



4

## మమతకు రెబల్ ఎంపీల షాక్



- మాదే అసలైన టీఎంసీ.. తమకే మెజారిటీ ఉందంటూ స్పీకర్ ఓం బిర్లాకు రెబల్స్ వినతిపత్రం
- కకోలి ఘోష్ నేతృత్వంలో ఒక గ్రూప్‌గా ఏర్పడిన 19 మంది ఎంపీలు
- ఎన్డీఏ కూటమికి మద్దతు ప్రకటిస్తామని బసునియా వెల్లడి
- తిరుగుబాటుదారుల జాబితాలో యూసుఫ్ పఠాన్, శతాబ్ది రాయ్, రచనా బెనర్జీ
- మమతా బెనర్జీ నాయకత్వంపై విశ్వాసం ప్రకటించిన శత్రుఘ్న సిన్హా, సౌగతా రాయ్

కోల్‌కతా: జూన్ 12(డ్రీమ్ టైమ్స్):
తృణమూల్ కాంగ్రెస్‌లో సంక్షోభం ముదురుతున్నది. అసలైన టీఎంసీ ఎవరిదన్న దానిపై పోరు తీవ్రమైంది. తమకే మెజారిటీ ఉన్నందున, అసలైన టీఎంసీ తమదేనని మమతా బెనర్జీపై తిరుగుబావుటా ఎగురవేసిన రెబల్ ఎంపీలు చెబుతున్నారు. -మిగతా 3 లో

## పాకిస్థాన్ నేవీలోకి కొత్త సబ్‌మెరైన్..



- చైనా నుంచి కరాచీ పోర్టుకు
- 8 జలాంతర్గాముల సరఫరా కోసం చైనాతో ఒప్పందం
- సాంకేతిక బదిలీ ద్వారా పాక్‌లోనే నాలుగింటి నిర్మాణం
- అత్యాధునిక స్టీల్త్ సామర్థ్యాలతో అమ్ములపొదిలోకి..

ఇస్లామాబాద్
పాకిస్థాన్ అమ్ములపొదిలోకి కొత్త జలాంతర్గామి వచ్చి చేరింది. హ్యాంగర్ క్లాస్ సబ్‌మెరైన్‌ను చైనాతో కలిసి ఆ దేశం సంయుక్తంగా నిర్మించింది. గురువారం కరాచీ పోర్టుకు ఆ సబ్‌మెరైన్ చేరుకున్నది. పాకిస్థాన్ నౌకాదళం ఆధునీకరణలో భాగంగా ఆ సబ్‌మెరైన్ వచ్చేసింది. పాకిస్థాన్ నేవీ డాక్‌యార్డ్‌కు చేరుకున్న సమయంలో రిసెప్షన్ సెర్మనీ నిర్వహించారు. కమాండర్ ఫ్లీట్ వైస్ అడ్మిరల్ అబ్దుల్ మునిబ్ చీఫ్ గెస్ట్‌గా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. నేవీ ఆఫీసర్లు, సిబ్బంది, కుటుంబసభ్యులు వెల్కమ్ కార్యక్రమంలో -మిగతా 3 లో



## వెన్నుపోటుకు రెండేళ్లు ఆందోళనలు

- రాష్ట్ర ప్రభుత్వంపై కదం తొక్కిన వైసీపీ శ్రేణులు
- వైసీపీ నిరసనలు, ఆందోళనలతో హోరెత్తిన 175 నియోజకవర్గాలు
- సూపర్ సిక్స్ సూపర్ సెవెన్ పేరుతో ప్రజలకు వెన్నుపోటు
- అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన కూటమి సర్కార్
- మెగా డీఎస్సీలో అన్యాయం జరిగిన అభ్యర్థులకు సంఘీభావ ర్యాలీ

3

## సర్ ప్రక్రియ.. ఓ భూతం లాంటిది

చట్టం ముసుగులో కేంద్ర ప్రభుత్వం దొంగదారి: మంత్రి పొంగులేటి



కాంగ్రెస్ బలంగా ఉన్న ప్రాంతాల్లో ఓట్ల తొలగింపునకు కుట్ర

- ఓటు పోకుండా ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేయాలి
- ఈడీ, సీబీఐల పేరుతో నేతలను లొంగతీసుకునేందుకు కేంద్రం యత్నం
- అగ్రనేత రాహుల్ గాంధీకి అండగా నిలవాలని పార్టీ శ్రేణులకు పిలుపు

ఖమ్మం జూన్ 12(డ్రీమ్ టైమ్స్):
ఎస్ఐఆర్ సర్ అనేది భయంకరమైన ఒక భూతమని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభివర్ణించారు. చట్టం అనే ముసుగులో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దొంగ దారి ఎస్ఐఆర్ అని తెలిపారు. శుక్రవారం ఖమ్మం జిల్లా ఏదులాపురంలో బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. అధికారులు ముందు ఓటు -మిగతా 3 లో



## రప్పా..రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదు

- రెడ్‌బుక్ తనపని తను చేసుకుంటూ పోతుంది
- రాయలసీమను రాయల్ సీమగా మార్చాం
- మనది గూగుల్ అయితే..వారిది గొడ్డలి
- తిరుపతి సభలో మంత్రి లోకేశ్ వ్యాఖ్యలు

తిరుపతి జూన్ 12(డ్రీమ్ టైమ్స్):
కూటమి పాలనలో జేసీబీలు, దాడులు, హత్యలు, బూతులు లేవని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వ నమ్మకం, సంక్షేమంపై తిరుపతి దామినీడులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామి జోలికి వెళ్లొద్దని నాటి సీఎంను హెచ్చరించామని.. దేవుడితో పెట్టుకుంటే పరిస్థితి ఏంటో ఇవాళ అనుభవిస్తున్నారని వ్యాఖ్యానించారు. రాయలసీమ అంటే ఎన్టీఆర్‌కు చాలా ప్రేమ అని తెలిపారు. నాడు కరువు వస్తే జోలె పట్టుకుని సీమ ప్రజలను ఆదుకున్నారని ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేశారు. రాయలసీమను రాయల్‌సీమగా -మిగతా 3 లో

# ప్రపంచ తొలి ట్రిలియనీర్‌గా ఎలన్ మస్క్

### హాట్‌కేకుల్లా స్పేస్‌ఎక్స్ ఐపీవో సేల్..



**న్యూయార్క్: జూన్ 12(డ్రీమ్ టైమ్స్):** స్పేస్‌ఎక్స్ కంపెనీ సీఈవో ఎలన్ మస్క్ ఇప్పుడు ట్రిలియనీర్ అయ్యారు. ఆయన సంపద ఇప్పుడు లక్ష కోట్లు దాటేసింది. తాజాగా ఆ కంపెనీ ఐపీవో సేల్స్ జరిగాయి. హాట్‌కేకుల్లా ఆ కంపెనీ షేర్లు అమ్ముడుపోయాయి. అనూహ్య రీతిలో ఆయన సంపద పెరిగిపోయింది. హేమీహేమీ టైకూన్లను దాటివేస్తూ.. ఔత్సాహిక వ్యాపారి దశ నుంచి ట్రిలియనీర్‌గా ఆయన ఎదిగారు. రాకెట్లు, శాటిలైట్లు, ఏఐ కంపెనీలు, టెస్లా కార్లు.. మస్క్ వ్యాపారంలో ఉన్నాయి. అయితే తాజా ఐపీవో ద్వారా స్పేస్‌ఎక్స్ కంపెనీ 75 బిలియన్ల డాలర్లు ఆర్జించింది. ఇన్షియల్ పబ్లిక్ ఆఫరింగ్‌లో పెట్టుబడిదారులు ఉత్సాహంతో పాల్గొన్నట్లు తెలుస్తోంది. అమెరికాలో ఐపీవో సేల్‌లో ఒక్కొక్క షేర్‌ను 135 డాలర్లకు అమ్మేశారు. దీంతో మస్క్ రాకెట్, స్పేస్‌క్రాఫ్ట్ తయారీ కంపెనీ విలువ అమాతం పెరిగింది. మొత్తం 555.56 మిలియన్ల షేర్లను అమ్మేశారు. దాంతో ఆ కంపెనీకి ఐపీవో ద్వారా సుమారు 75 బిలియన్ల డాలర్లు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో స్పేస్, శాటిలైట్, ఏఐ కంపెనీల మొత్తం విలువు సుమారు 1.77 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ తొలిసారి శుక్రవారం వాల్‌స్ట్రీట్ ట్రేడింగ్‌లోకి వెళ్లింది. నాస్‌డాక్‌లో ట్రేడింగ్ కోసం షేర్లను అమ్మిన అమెరికా కంపెనీల్లో స్పేస్‌ఎక్స్ ఏడో స్థానంలో ఉన్నది. ఫోర్బ్స్, ఆల్ఫాబెట్ కంపెనీలు కూడా గతంలో షేర్లను సేల్ చేశాయి. రెండో సంపన్న వ్యక్తి కేవలం 300 బిలియన్ల డాలర్ల దగ్గరే ఉన్నారని, అంటే మస్క్ దగ్గర ఉన్న దాంట్లో మూడో వంతు అని ఫోర్బ్స్ వెల్త్ ఎడిటర్ మాట్ డ్యూరట్ తెలిపారు. ఒరాకిల్ ఫౌండర్ లారీ ఎల్లిసన్ సంపద సుమారు 400 బిలియన్ల డాలర్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు.


# నామినేషన్ తిరస్కరిస్తే..
# దాన్ని ఈసీనే పరిష్కరించాలి



**న్యూఢిల్లీ జూన్ 12(డ్రీమ్ టైమ్స్):** కాంగ్రెస్ నేత మీనాక్షీ నటరాజన్.. రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ కేసును సుప్రీంకోర్టు విచారించింది. మధ్యప్రదేశ్ నుంచి ఆమె వేసిన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి రద్దు చేసిన విషయం తెలిసిందే. ఆమెపై లీగల్ కేసు ఉన్న నేపథ్యంలో ఫామ్26 ప్రకారం మీనాక్షీ నామినేషన్‌ను తిరస్కరించారు. అయితే అత్యవసర పిటీషన్‌పై ఇవాళ సుప్రీంకోర్టు స్పందిస్తూ.. గతంలో నామినేషన్ల పత్రాలను తిరస్కరించిన కేసుల్లో ఎప్పుడైనా కోర్టు జోక్యం చేసుకున్న తీర్పులు ఉన్నాయా అని సుప్రీంకోర్టు మీనాక్షీ లాయర్‌ను ప్రశ్నించింది. ఒక్కసారి నామినేషన్ తిరస్కరణకు గురైతే, దాని పరిష్కారం కోసం ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాల్సిందే అని సుప్రీంకోర్టు చెప్పిందిజస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, అతుల్ ఎస్ చందూర్కర్‌తో కూడిన ధర్మాసనం ఈ కేసులో ఆ సూచన చేసింది. ఆ నిర్ణయం ఎంత తప్పైనా కానీ, ఒకసారి నామినేషన్ తిరస్కరణకు గురైతే, దానికి పరిష్కారం అక్కడే ఉంటుందని కోర్టు చెప్పింది. ఇలాంటి కేసులు గతంలో ఉన్నాయా, వాటి పట్ల ఏదైనా తీర్పు ఉందా అని సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీని కోర్టు ప్రశ్నించింది. ఏదైనా క్రిమినల్ కేసులో రెండేళ్ల శిక్ష పడితేనే అప్పుడు సమాచారాన్ని వెల్లడించాలని, కానీ ప్రస్తుత కేసులో కేవలం సమన్లు మాత్రమే జారీ చేశారని న్యాయవాది అభిషేక్ సింఘ్వీ కోర్టుకు తెలిపారు. తప్పుడు పద్ధతిలో మధ్యప్రదేశ్ రిట్నరింగ్ అధికారి రాజ్యసభ నామినేషన్ పత్రాలను తిరస్కరించినట్లు సింఘ్వీ పేర్కొన్నారు. కానీ మీనాక్షీ నటరాజన్ అసంపూర్ణ పత్రాలను సమర్పించినట్లు రిటర్నింగ్ ఆఫీసర్ అరవింద్ శర్మ పేర్కొన్నారు. ఫామ్ 26లో కోర్టు ఫిర్యాదు గురించి వెల్లడించలేదని ఆర్వో చెప్పారు. తెలంగాణలో రిజిస్టర్ అయిన కేసును మీనాక్షీ తన అఫిడవిట్‌లో పొందుపరచలేదని మధ్యప్రదేశ్ బీజేపీ అభ్యర్థి మహేశ్ కేవత్ తన ఫిర్యాదులో పేర్కొన్న విషయం తెలిసిందే. మీనాక్షీ రిట్ పిటీషన్‌ను సుప్రీంకోర్టు కొట్టిపారేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 329 ప్రకారం ఆ పిటీషన్‌ను కోర్టు డిస్మిస్ చేసింది. నామినేషన్ తిరస్కరణ అంశంలో ఆర్టికల్ 32 ప్రకారం చర్యలు తీసుకోవాలని మీనాక్షీ తరపున న్యాయవాది కోర్టును కోరారు. ఈ కేసులో ఎన్నికల పిటీషన్ దాఖలు చేసుకోవాలని సుప్రీం సూచించింది. ఈ కేసులో ఎటువంటి మెరిట్స్ లేవని ధర్మాసనం పేర్కొన్నది.

# కోచింగ్ లేకుండా 23 ఏళ్లకే 19
# ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన చారుపాండే..

### రాష్ట్రపతి నుంచి ఆహ్వానం



**న్యూఢిల్లీ జూన్ 12(డ్రీమ్ టైమ్స్):** ఏదైనా ఒక్క ప్రభుత్వం ఉద్యోగం సాధించాలనేది దేశంలోని కోట్లాది మంది అభ్యర్థుల కల. అందులో విజయం సాధించేది చాలా తక్కువ. అదీ ఒక్క ఉద్యోగం సంపాదించడమే చాలా గొప్ప. అలాంటిది ఒక యువతి ఏకంగా 19 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. అందులోనూ దేనికీ కోచింగ్ తీసుకోకపోవడం ఇంకో విశేషం. ఇలా అరుదైన ఘనత సాధించిన యువతి పేరు చారు పాండే. ఆమె సొంతూరు ఛత్తీస్‌గడ్‌లోని తిల్దా నియోరా ప్రాంతం.ప్రస్తుతం ఆమె కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విభాగంలో అసిస్టెంట్ ఆడిటర్‌గా పని చేస్తున్నారు. మ్యాథమెటిక్స్‌లో గ్రాడ్యుయేట్ చేసిన చారు పాండే.. కాలేజీలో చదువుతున్నప్పటినుంచే కాంపిటీటీవ్ ఎగ్జామ్స్‌కు ప్రిపేరయ్యేది. అలాగని, వాటికోసం ఏ కోచింగ్ సెంటర్‌లో కూడా చేరలేదు. యూట్యూబ్‌లో అందుబాటులో ఉండే వీడియోలు చూస్తూ పరీక్షలకు సిద్దమైంది. రోజూ 20 గంటల్ని చదువుకు అనుగుణంగా ప్లాన్ చేసుకునేది. అలా ఇప్పటివరకు తను అటెండ్ చేసిన అనేక ఉద్యోగాల్ని దక్కించుకుంది. మొత్తం 19 ఉద్యోగాలకు ఎంపికైంది. 23 ఏళ్ల వయసుకే 19 ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగాలు దక్కించుకుంది. ఆమె సాధించిన విజయాల్ని గుర్తించిన రాష్ట్రపతి కార్యాలయం వచ్చే ఆగష్టు 15, స్వాతంత్ర్య దినోత్సవం రోజున నిర్వహించనున్న 'ఎట్ హోం' కార్యక్రమానికి ఆహ్వానం అందింది. దేశంలోని స్ఫూర్తిదాయకమైన యువత విభాగంలో చారు పాండేకు ఆహ్వానం దక్కింది. అతి చిన్న వయసులో అత్యధిక ఉద్యోగాలకు ఎంపికై, దేశంలోని యువతకు చారు పాండే ఆదర్శంగా నిలిచారు. తాను 19 ఉద్యోగాల్ని సాధిస్తానని అనుకోలేదని, ఒక ప్రభుత్వ ఉద్యోగం సాదిస్తే చాలని భావించానని చారు పాండే అన్నారు. తాను ఒక ఉద్యోగం కోసం దానికి సంబంధించిన సిలబస్ పూర్తి చేయడానికి వంద శాతం కష్టపడతానని ఆమె తెలిపింది. చారు పాండే సాధించిన ఉద్యోగాలివి. ఎస్ఎస్‌సీ (సీజీఎల్), ఎస్‌-ఎస్‌సీ (సీహెచ్ఎస్ఎల్), ఎస్ఎస్‌సీ (ఎంటీఎస్), ఎస్‌-ఎస్‌సీ (జీడీ), ఎస్ఎస్‌సీ (సీపీవో), ఐబీపీఎస్ పీవో, ఐబీపీఎస్ క్లర్క్, ఎస్‌బీఐ పీవో, ఎస్‌బీఐ క్లర్క్, ఆర్ఆర్‌బీ ఎన్‌టీపీసీ, ఆర్ఆర్‌బీ గ్రూప్ డీ, సీజీ ఎస్ఐ, ఢిల్లీ పోలీస్, సీజీ ఎన్‌హెచ్ఎం, ట్రాన్స్‌పోర్ట్ ఎస్ఐ, ఎస్‌-ఎస్‌సీ (సీజీఎల్) 2023, ఎస్ఎస్‌సీ (సీహెచ్ఎస్ఎల్ 2023), ఎస్ఎస్‌సీ (ఎంటీఎస్) 2023, ఆర్ఆర్‌బీ గ్రూప్ డి.

## ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు..

### -లక్నోలో టేకాఫ్‌కు ముందే ప్రయాణికుల దింపివేత



**న్యూఢిల్లీ జూన్ 12(డ్రీమ్ టైమ్స్):** ఇండిగో విమానానికి శుక్రవారం బాంబు బెదిరింపు వచ్చింది. జూన్ 12న లక్నో నుంచి ఢిల్లీ బయల్దేరాల్సిన విమానానికి బాంబు బెదిరింపు వచ్చిందని ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. విమానం టేకాఫ్ కావడానికి కొద్ది నిమిషాల ముందు బాంబు బెదిరింపు వచ్చింది. సమాచారం అందుకున్న భద్రతాదళాలు వేగంగా స్పందించాయి.విమానాన్ని నిలిపివేశారు. విమానంలోని ప్రయాణికుల్ని, సిబ్బందిని దింపివేశారు. దూరంగా నిలిపి తనిఖీలు చేపడుతున్నారు. సీఐఎస్ఎఫ్ (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్)తోపాటు స్థానిక పోలీసులు ఈ సెక్యూరిటీ ఆపరేషన్స్‌లో పాల్గొంటున్నారు. సెక్యూరిటీ ప్రొటోకాల్ ప్రకారం అధికారులు విమానంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రయాణికులకు సమాచారాన్ని చేరవేసి, వారి కోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. బాంబు బెదిరింపు కాల్ తర్వాత కొద్దిసేపు విమాన సేవలకు ఎయిర్‌పోర్టులో అంతరాయం కలిగింది. కొన్ని విమాన సర్వీసులకు ఆలస్యం కానున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ముందు జాగ్రత్త చర్యగా అధికారులు ఎయిర్‌పోర్టులో కూడా తనిఖీలు చేపడుతూ, భద్రతను కట్టుదిట్టం చేశారు. మరోవైపు ఈ బాంబు బెదిరింపు ఎవరు చేశారు.. ఎక్కడ్నుంచి వచ్చింది అనే అంశాలపై కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు. ప్రయాణికుల భద్రతే తమ మొదటి ప్రాధాన్యమని ఎయిర్‌పోర్ట్ అధికారులు ప్రకటించారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రోటోకాల్ ప్రకారం అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## నావికుల మృతిపై ప్రధాని మాట్లాడాలి



**న్యూఢిల్లీ జూన్ 12(డ్రీమ్ టైమ్స్):** గతవారం అమెరికా బలగాలు ఒమన్ తీరం వద్ద ఉన్న 'సెట్టిబెల్లో' నౌకపై చేసిన దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మృతి చెందారు. ఈ ఘటనపై ప్రధాని మౌనం వహించడంపై శుక్రవారం లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, 'అంతర్జాతీయ జలాల్లో మూడు నౌకలపై అమెరికా జరిపిన దాడుల్లో మూడు రోజుల్లోనే ముగ్గురు భారతీయులు మరణించారు. అమెరికాకు లొంగిపోయిన మన ప్రధాని మాత్రం ఇప్పటివరకు ఈ ఘటనపై ఒక్కమాట కూడా మాట్లాడలేదు. ఏదైనా విదేశీ శక్తి ఒక భారతీయుడిని హత్య చేసినప్పుడు ప్రధాని స్పందించాలి. కానీ, ఆయన ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దురదృష్టకరం. మన నావికుల్ని హత్య చేసిన కొద్దిరోజులకే.. అంటే వచ్చేవారమే జి7 సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో మోడీ గారు చిరునవ్వు చిందిస్తూ.. ఆలింగనం చేసుకుంటూ.. ఒప్పందాలపై సంతకాలు చేస్తారు. కానీ చనిపోయిన ఈ ముగ్గురు భారతీయుల గురించి మాత్రం ఆయన ఒక్కమాట కూడా మాట్లాడరు. తమ ప్రాణాలను బలిగొన్న వారిని ఎదిరించే ధైర్యం గానీ, శక్తి గానీ లేని ఒక లొంగిపోయిన ప్రధానమంత్రి 'భారతమాత' బిడ్డలను రక్షించలేరు' అని మోడీ తన సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో మోడీని తీవ్రంగా విమర్శించారు.

# మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగం..

### - మమతా బెనర్జీపై ఎఫ్ఐఆర్ నమోదు



**న్యూఢిల్లీ జూన్ 12(డ్రీమ్ టైమ్స్):** టీఎంసీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదైంది. దక్షిణ కోల్‌కతాలోని నేతాజి నగర్ పోలీస్ స్టేషన్‌లో కోల్‌కతాకు చెందిన ఒక వ్యక్తి మమతపై ఫిర్యాదు చేశాడు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మమత గత మార్చిలో ధర్మతలలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒకవర్గానికి వ్యతిరేకంగా, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారని ఆమెపై నమోదైన ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి మీరు క్షేమంగా ఉన్నారని, లేకుంటే ఒక వర్గం చేతిలో అణిచివేతకు గురయ్యే వారు అంటూ అప్పట్లో మమత వ్యాఖ్యానించినట్లు ఫిర్యాదులో వివరించారు. ఆమె వ్యాఖ్యలు మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. వివిధ వర్గాల మధ్య వైషమ్యాలు, భయం పెంపొందించేలా, ఉద్రిక్తతలు రెచ్చగొట్టేలా మమత వ్యవహరించారని ఫిర్యాదులో వివరించారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. మే 20న ఈ ఫిర్యాదు దాఖలైంది. శుక్రవారం ఈ ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన మమతకు తాజా రాజకీయ పరిణామాలు ఇబ్బందిగా మారిన సంగతి తెలిసిందే. పార్టీకి చెందిన మెజారిటీ నేతలు టీఎంసీని వీడుతున్నారు. ఎంపీలు రెబల్స్‌గా ఏర్పడి బీజేపీకి మద్దతు ప్రకటించారు. తమను ప్రత్యేక వర్గంగా చూడాలని లోక్‌సభ స్పీకర్‌ను కోరారు. మరోవైపు ఎమ్మెల్యేలు కూడా పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నారు. దీంతో పశ్చిమ బెంగాల్‌లో ఇప్పుడు టీఎంసీ భవితవ్యంతోపాటు మమత రాజకీయ భవిష్యత్ కూడా ప్రశ్నార్థకంగా మారింది.


## ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ అంత్యక్రియలు మరోసారి వాయిదా



**న్యూఢిల్లీ జూన్ 12(డ్రీమ్ టైమ్స్):** ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు మరోసారి వాయిదా పడ్డాయి. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన ఖమేనీ అంత్యక్రియలను జూన్ చివరి వరకు లేదా జూలై ఆరంభం వరకు వాయిదా వేస్తున్నట్లు టెహ్రాన్ మేయర్ ప్రకటించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, భద్రతా కారణాలు,భద్రతా కారణాలు, మొహర్రం మాసంలో ప్రజల సంతాప కార్యక్రమాలు ఉన్నందున ఈ అంత్యక్రియలను జూన్ 26 జూలై 5 మధ్య కాలానికి వాయిదా వేస్తున్నట్లు టెహ్రాన్ మేయర్ అలీరెజా జకాని ప్రకటించారు.ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం మొదటి నెల అయిన 'ముహర్రం' ప్రారంభంలో (జూన్ ఆరంభంలో) ఈ మూడు రోజుల కార్యక్రమాన్ని నిర్వహించాలని ఇరాన్ ఇంతకుముందు భావించింది. అయితే, కర్బలా యుద్ధంలో (క్రీ.శ. 680) అమరులైన ప్రముఖ షియా నాయకుడు ఇమామ్ హుస్సేన్ స్మారకార్థం భక్తులు జరిపే వార్షిక సంతాప కార్యక్రమాలను పూర్తి చేసుకునేందుకు వీలుగా ముహర్రం మొదటి పది రోజుల తర్వాతే ఈ అంత్యక్రియల కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు మేయర్ అలీరేజా వెల్లడించారు. ఈ కార్యక్రమానికి దాదాపు 2 కోట్ల (20 మిలియన్ల) మంది ప్రజలు హాజరవుతారని టెహ్రాన్ అధికారులు అంచనా వేస్తున్నారు. దాదాపు 37 ఏళ్లపాటు ఇస్లామిక్ రిపబ్లిక్‌కు నాయకత్వం వహించిన ఖమేనీ, ఫిబ్రవరి 28న మధ్య టెహ్రాన్‌లోని తన నివాసంలో మరణించారు. వాస్తవానికి మార్చి 4న జరగాల్సిన ఈ అధికారిక అంత్యక్రియల కార్యక్రమం, యుద్ధం కారణంగా వాయిదా పడింది.

## మణిపూర్ లో మరోసారి చెలరేగిన హింస..

### ఇద్దరు కుకీలు మృతి



**ఇంఫాల్ : జూన్ 12(డ్రీమ్ టైమ్స్):** మణిపూర్ లో మరోసారి హింస చెలరేగింది. గుర్తు తెలియని సాయుధ దుండగుల దాడిలో ఒక మహిళ సహా ఇద్దరు కుకీలు మరణించినట్లు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామ్ జోంగ్ జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఈఘటన జరిగిందని అన్నారు. భారత్-మయన్మార్ సరిహద్దులోని కామ్ జోంగ్ జిల్లా కులుత్ గ్రామంలో ఇద్దరు కుకీలు మరణించినట్లు ఇంఫాల్ అధికారులు ధృవీకరించారు. మరో ఇద్దరు గాయపడ్డారని అన్నారు. నాగా గ్రూప్ దాడికి పాల్పడినట్లు ఈస్టర్న్ కుకీ చీఫ్స్ అసోసియేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. చర్చీ సహా ఏడు నివాసాలకు నిప్పుపెట్టారని, దీంతో ప్రైవేట్ ఆస్తులకు తీవ్ర నష్టం వాటిల్లిందని అన్నారు. బంధీలుగా తీసుకువెళ్లిన ఆరుగురు నాగాలను హత్య చేశారన్న ఆరోపణలపై మే 13న సేనాపతి జిల్లాలో హింస చెలరేగిన సంగతి తెలిసిందే. సేనాపతి, కామ్ జోంగ్ రెండు జిల్లాలు కూడా నాగా ప్రాబల్యం ఉన్నవి. అయితే అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ప్రాంత ఆధిపత్యం కోసం సాయుధ కుకీ గ్రూప్, మరో కుకీ తీవ్రవాద గ్రూపుల మధ్య ఘర్షణ కొనసాగుతోందని ఈస్టర్న్ కమాండ్ నాగా విలేజ్ గార్డ్ ఆరోపించింది. దాడిచేసిన కుకీ గ్రూప్ లలో ఒకటి మయన్మార్ కు చెందినదని ఆ సంస్థ పేర్కొంది.

డ్రీమ్ టైమ్స్
తెలుగు దిన పత్రిక
DREAM TIMES DAILY NEWS PAPER

శనివారం
13-06-2026

Ananthapuram, Kurnool, Kadapa
అనంతపురం, కర్నూల్,కడప

# పెట్రోల్ బంకుల వద్ద భారీ డీజిల్ కొనుగోళ్లకు బ్రేక్

-ఒక్కో వాహనానికి 200 లీటర్లకే పరిమితి
-పరిశ్రమలు ప్రత్యేక సరఫరా వ్యవస్థల నుంచే కొనుగోళ్లు
-90 రోజుల పాటు అమల్లో కేంద్ర ఆంక్షలు
-పెట్రోల్ బంకులపై ఆంక్షలు విధించిన కేంద్రం



**న్యూఢిల్లీ,**
పశ్చిమాసియా పరిణామాలతో ముడిచమురు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ బంకుల నుంచి భారీ మొత్తంలో పెట్రోల్, డీజిల్ కొనుగోలుపై నిషేధం విధించింది. ఈ ఆంక్షలు 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఒక వాహనానికి రోజుకు 200 లీటర్ల కంటే ఎక్కువ డీజిల్‌ను నింపవద్దని రిటైల్ అవుట్‌లెట్ల యాజమాన్యాలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా బల్క్ ఇంధన ధరలు, రిటైల్ ధరల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది. ముఖ్యంగా డీజిల్ ధర పెట్రోల్ బంకుల్లో లీటర్‌కు రూ.95.20గా ఉండగా.. బల్క్ ధర రూ.134.50 పలుకుతోంది. దీంతో ఇటీవల కొన్ని పరిశ్రమ వర్గాలకు చెందిన, వాణిజ్య వినియోగదారులు బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచి కాకుండా పెట్రోల్ బంకుల నుంచి ఎక్కువ మొత్తంలో ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో కొన్ని బంకుల్లో పెట్రోల్, డీజిల్ విక్రయాలు అసాధారణ స్థాయిలో పెరిగినట్లు అధికారులు గుర్తించారు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో రిటైల్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీన్ని అరికట్టేందుకు కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ **శాఖ తాజా ఆదేశాలిచ్చింది.** పరిశ్రమ, వాణిజ్య అవసరాల కోసం వినియోగదారులు రిటైల్ పెట్రోల్ బంకుల్లో ఇంధనం కొనుగోలు చేయకుండా నిషేధం విధించింది. బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచే వారు పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయాలని స్పష్టం చేసింది. అంతేగాక, పెట్రోల్ బంకుల వద్ద ఒక వాహనానికి లేదా ఒక కస్టమర్‌కు రోజుకు 200 లీటర్లకు మించి డీజిల్‌ను విక్రయించొద్దని ఆదేశించింది. ఈ డీజిల్‌ను పునర్‌విక్రయించకూడదని సూచించింది. ఈ ఆదేశాలు తొలుత 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని, అవసరమైతే పరిస్థితిని బట్టి పొడిగిస్తామని పెట్రోలియం మంత్రిత్వశాఖ తమ ఉత్తర్వుల్లో వెల్లడించింది.

# రాష్ట్రవ్యాప్తంగా మోగినబడి గంట

మొదటి తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా మోగిన బడి గంట
- తొలిరోజు పండుగ వాతావరణంలో బడులకు పిల్లలు

మంగళవాద్యాలతో పాఠశాలకు : అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా, తొలిరోజు బడులకు పిల్లలు ఉత్సాహంగా హాజరయ్యారు. పాఠశాల వద్ద ముగ్గులు వేసి తోరణాలు కట్టి మరి విద్యార్థులకు స్వాగతం పలికారు. జిల్లాలో 1551 సర్కారు బడులు ఉండగా, సుమారు 40 శాతం మంది పిల్లలు తొలిరోజు బడులకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. పాఠ్య పుస్తకాలు, డిక్షనరీలు విద్యార్థులకు ఇచ్చేందుకు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఆత్రేయపురం మండలంలో ప్రధాన ఫౌండేషన్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చింతా శ్యామ్ కుమార్ పాఠశాల ప్రారంభోత్సవం సందర్భంగా 'మన బడి - మన పండుగ' కార్యక్రమాన్ని వినూత్న రీతిలో నిర్వహించారు. ఉదయామే చిన్నారులు ఇంటికి వెళ్లిన శ్యామ్ ప్రత్యేకంగా తయారు చేసిన 'మన బడి- మన పండుగ' కిరీటాన్ని వారికి ధరింపజేశారు. తర్వాత మంగళవాద్యాల మధ్య విద్యార్థులను పాఠశాలకు తీసుకోచ్చారు.

**మంత్రి లోకేష్ శుభాకాంక్షలు :**
పార్వతీపురం మన్యం జిల్లాలో వేసవి సెలవుల తర్వాత విద్యార్థులు బడిబాట పట్టారు. మామిడి తోరణాలు కట్టి ఉత్సాహకరమైన వాతావరణంలో ఉపాధ్యాయులు బడిలోకి పిల్లలను ఆహ్వానించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను, విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ రావు సందర్శించారు. పాఠశాలలో కొత్తగా ప్రవేశం పొందిన విద్యార్థులను అభినందించారు. వారికి చాక్లెట్లు అందించి ఉత్సాహపరిచారు. వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులకు మంత్రి లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. సమగ్ర విద్యా వికాస కేంద్రాలైన ప్రభుత్వ విద్యాలయాలు పిల్లలకు సాదర స్వాగతం పలుకుతున్నాయి. కొత్త విద్యా సంవత్సరపై ఆశావాహంగా : రాష్ట్రవ్యాప్తంగా సుమారు 45 వేల ప్రభుత్వ పాఠశాలలు, 44 వేల ప్రైవేటు పాఠశాలలు నేడు తిరిగి ప్రారంభమయ్యాయి. మొదటి రోజనే విద్యార్థులకు ఆహ్వానం పలికేందుకు పాఠశాల యాజమాన్యాలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు కొత్త విద్యా సంవత్సరపై ఆశావహంగా ఉన్నారు.

# మమతకు రెబల్ ఎంపీల షాక్

మొదటి తరువాయి

తమ గ్రూప్‌నే అసలైన టీఎంసీగా గుర్తించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి విన్నవించనున్నారు. ఈ సందర్భంగా రెబల్ ఎంపీ జగదీశ్ చంద్ర బర్మా బసునియా మాట్లాడుతూ రెబల్ ఎంపీలు ఇప్పటికే స్పీకర్ బిర్లాకు వినతిపత్రం సమర్పించారని, దీనిపై సోమవారం అధికారిక ప్రకటన రావచ్చునని తెలిపారు. కాగా, టీఎంసీ ఎంపీ కకోలి ఘోష్ నేతృత్వంలో 19 మంది అసమ్మతి ఎంపీలు ఇప్పటికే ఒక గ్రూప్‌గా ఏర్పడ్డారు. సభలో పార్టీ విప్‌గా దస్తీదార్ కొనసాగుతారని వారు స్పీకర్‌కు సమర్పించిన లేఖలో పేర్కొన్నారు.
మేం బిర్లాకు లేఖ సమర్పించాం. సోమవారం ఆయనను వ్యక్తిగతంగా కలిసి మాదే అసలైన టీఎంపీ పార్లమెంటరీ గ్రూప్ అని తెలిపి, మమ్మల్ని గుర్తించమని విజ్ఞప్తి చేస్తాం' అని బసునియా పేర్కొన్నారు. కాగా, ఇప్పటికే రెబల్ ఎంపీలతో ప్రత్యేక గ్రూప్‌గా ఏర్పడిన క్రమంలో తాము బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏకు మద్దతు ప్రకటిస్తామని ఆయన ప్రకటించారు. శాసనకర్తలను పక్షం మారేలా ప్రేరేపిస్తున్నారు అంటూ టీఎంసీ ఎంపీ కీర్తి ఆజాద్ చేసిన ఆరోపణలపై స్పందిస్తూ ఆయనో అబద్ధాలకోరు అని బసునియా వ్యాఖ్యానించారు. తాము 19 మంది ఎంపీలం ఉన్నామని, ఒక ఎంపీగా కీర్తి ఆజాద్ అలాంటి విమర్శలు చేయడం తగదని అన్నారు.

**రెబల్స్‌లో యూసుఫ్ పఠాన్, కకోలి ఘోష్**
తమ పార్టీ అధిష్ఠానంపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ రెబల్ ఎంపీలు 19 మంది లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఒక లేఖను సమర్పించారు. మే 18న సమర్పించిన లేఖపై సంతకం చేసిన వారిలో ఎంపీలు సాయోని ఘోష్, శతాబ్ది రాయ్, యూసుఫ్ పఠాన్, రచనా బెనర్జీ తదితరులు ఉన్నారు. కాగా, గురువారం మరో టీఎంసీ రాజ్యసభ ఎంపీ పార్టీకి రాజీనామా చేశారు. ప్రకాశ్ చిక్ బరైక్ రాజ్యసభ సభ్యత్వానికి, పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. కాగా, టీఎంసీలో సీనియర్ నేతలైన శత్రుఘ్న సిన్హా, బాబుల్ సుప్రియో, సౌగతా రాయ్‌లు మమత నాయకత్వంపై తమ విశ్వాసాన్ని ప్రకటించారు.

# స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నాం

మొదటి తరువాయి



డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కేంద్రమంత్రులు, కూటమి నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి కేంద్రం బతికించిందని చెప్పుకొచ్చారు. అమరావతి, పోలవరం, రైల్వే జోన్ అంశాల్లో కేంద్ర సహకారం దక్కిందన్నారు. అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఎక్కడా లేనివిధంగా ఏపీలో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యాలతో ముందుకెళ్తున్నామని చెప్పారు. 63 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేశామని, ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం పథకం ద్వారా డబ్బులు ఇస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందజేస్తున్నామన్నారు. రైతులు, గీత కార్మికులు, వడ్డెర్లు, చేనేతలు సహా అన్ని వర్గాలను ఆదుకున్నామని తెలిపారు. పి4 ప్రయోగంతో ఆర్థిక అసమానతలను తగ్గించామన్నారు. నా రాజకీయ ప్రయాణం తిరుపతిలోనే మొదలు పెట్టా. ఇదే రోజున నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశా.. రెండేళ్లయింది. రాష్ట్రాన్ని గెలిపిద్దామని 2024 ఎన్నికల్లో మోదీ, పవన్, నేను కలిశాం. ప్రజల ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. విభజన వల్ల కొంత నష్టపోతే.. గత ప్రభుత్వం వల్ల పూర్తిగా నష్టపోయాం. 2019లో ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసం ప్రారంభమైంది. విధ్వంస పాలన వల్ల వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. గత ప్రభుత్వ విధ్వంసంతో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయారు. తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపి వేధించారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా నన్ను 53 రోజులు జైల్లో ఉంచారు. పవన్ కల్యాణ్‌ను అడుగడుగునా అడ్డుకొని వేధించారు. మూడు రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడి చిచ్చు పెట్టారని మండిపడ్డారు. ఎన్నికల్లో విజయం చూసి పొంగిపోలేదు.. రాష్ట్ర దుస్థితి చూసి కుంగిపోలేదు. హంద్రీనీవా పూర్తి చేసి కుప్పానికి నీళ్లు తీసుకొచ్చాం. ఈ ఏడాది కల్యాణి డ్యామ్‌కు నీరు తీసుకొచ్చి.. శ్రీశైలం మల్లన్న, తిరుపతి వెంకన్నను కలుపుతాం. అన్ని రంగాలపై ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశాం. ప్రజా ప్రభుత్వం నడిపించే వ్యక్తిగా అన్ని వివరాలు బహిర్గతమే. డబుల్ ఇంజిన్ సర్కారు వల్ల ప్రయోజనాలు ఇవాళ చూస్తున్నాం. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి కేంద్రం బతికించింది.ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం. పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ సహా అనేక విషయాల్లో కేంద్రం అండగా నిలిచింది. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తున్నాం. అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తాం. ఎన్టీఆర్ భరోసా.. దేశంలోనే అతిపెద్ద సంక్షేమ కార్యక్రమం అన్నారు. గిట్టుబాటు ధర లేకపోతే రైతులను ఆదుకునే కార్యక్రమాలు చేస్తున్నాం. పీ4 ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గిస్తున్నాం. ఓటమి ఎరుగని నాయకుడు నరేంద్రమోదీ. గుజరాత్, దిల్లీలో మోదీ అనేక కార్యక్రమాలు చేయగలిగారు. 12 ఏళ్లలో ప్రధాని మోదీ సారథ్యంలో దేశం అభివృద్ధివైపు దూసుకెళ్లిందని సీఎం అన్నారు. 2024 ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రాన్ని గెలిపిద్దాం.. ప్రజాస్వామ్యాన్ని కాపాడదామని ప్రజలను కోరామని తెలిపారు. 2024లో 57 శాతం ఓట్ షేర్.. 94 శాతం స్ట్రయిక్ రేట్ సాధించామని చెప్పుకొచ్చారు. 2024లో రాష్ట్రాన్ని ప్రజలే కాపాడుకున్నారని అన్నారు. తన రాజకీయ ప్రయాణం తిరుపతిలోనే మొదలైందన్నారు. రాష్ట్రం, దేశం బాగుండాలని కోరుకునే వ్యక్తి పవన్ అని చంద్రబాబు వెల్లడించారు. వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని సీఎం విమర్శించారు. ప్రజా వేదిక కూల్చివేతతో జగన్ అరాచక పాలన మొదలైందని అన్నారు. కేంద్ర పథకాలు, సాగునీటి ప్రాజెక్టులను పక్కన పడేశారని మండిపడ్డారు. అప్పులు, అరాచకాలు, ఆర్థిక విధ్వంసం తప్ప జగన్ చేసిందేమీలేదని విమర్శించారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. కేసులు, జైళ్లతో చీకటి పాలన సాగించారని దుయ్యబట్టారు. అలాంటి దశలో నాలుగోసారి సీఎంగా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. ఏపీలో చీకటి పాలన పోయి.. ప్రజాపాలన వచ్చిందన్నారు. 21వ శతాబ్దం ప్రధాని మోదీదే అని సీఎం స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్‌తో దేశానికి మోదీ ఆత్మస్థైర్యం ఇచ్చారన్నారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే తిరుగులేని శక్తిగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. మోదీ పాలనలో భారత్ ప్రతిష్ఠ పెరిగిందని వెల్లడించారు. పుట్టపర్తిలో ఐదో తరం ఫైటర్‌జెట్ తయారుకాబోతోందన్నారు. తిరుపతిలో బుల్లెట్ ఫ్యాక్టరీ వస్తోందని, రాయలసీమ ఇప్పుడు బంగారుసీమ కాబోతోందన్నారు. వచ్చే నెలలో రాయలసీమ స్టీల్ ప్లాంట్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. జొన్నవాడలో బంగారం వెలికితీస్తామన్నారు. గ్రీన్ ఎనర్జీ, సోలార్, విండ్ పవర్‌పై దృష్టి సారించినట్లు చెప్పారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారుచేస్తున్నామని తెలిపారు. రూ.లక్ష కోట్లతో రాయలసీమ ముఖచిత్రాన్ని కాపాడతామన్నారు. కల్యాణి డ్యామ్‌కు ఈ ఏడాది నీళ్లు తీసుకొస్తున్నామన్నారు. 3 రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడారని మండిపడ్డారు. '3 రాజధానులు కాదు.. 3 ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం' ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.
కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా ఈసభలో పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియ..ఓ భూతం లాంటిది

మొదటి తరువాయి

మ్యాపింగ్ చేస్తారని పేర్కొన్నారు. గ్రామంలో ఓట్లు తొలగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలంటూ బూత్ లెవల్ ఏజంట్లకు ఆయన స్పష్టం చేశారు. వివిధ కారణాలతో ఓట్లు తొలగిస్తారని బూత్ లెవల్ ఏజంట్లను అప్రమత్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ప్రాంతాల్లో ఓటర్ లిస్టు పేరుతో ఓట్లు తొలగిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ద్వారా రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలను కేంద్రం ఓడించిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఓట్ల తొలగింపును తిప్పి కొట్టాల్సిన బాధ్యత బీఎల్‌ఏలదేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న అభిమానం కాపాడుకుంటే చాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ లబ్ధి పొందాలని చూస్తే.. దానిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలి?పారు. రాజ్యసభ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్‌కు టికెట్ ఇస్తే బీజేపీ గెలవదని తెలిసి కూడా ఆ పార్టీ అభ్యర్థిని పెట్టిందని చెప్పారు. తెలంగాణాలో ఎఫ్ఐఆర్ ఉందని అన్యాయంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఇంతకు ముందు ఓట్లు దొంగిలించారని.. ఇప్పుడు సీట్లు దొంగిలించారని బీజేపీ తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. సీబీఐ, ఈడీ పేరుతో గెలిచిన వారిని.. వారి వైపు తిప్పుకునేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ చూస్తుందని మండిపడ్డారు. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి మనమందరం అండగా ఉండాలని పార్టీ శ్రేణులకు మంత్రి పొంగులేటి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కుట్రలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుడిలా కష్టపడి ఓటు పోగొట్టకుండా జాగ్రత్త పడాలని బీఎల్‌ఏలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు.

# వెన్నుపోటుకు రెండేళ్లు ఆందోళనలులి

- రాష్ట్ర ప్రభుత్వంపై కదం తొక్కిన వైసీపీ శ్రేణులు
- వైసీపీ నిరసనలు, ఆందోళనలతో హోరెత్తిన 175 నియోజకవర్గాలు
-- సూపర్ సిక్స్ సూపర్ సెవెన్ పేరుతో ప్రజలకు వెన్నుపోటు
- అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన కూటమి సర్కార్
-- మెగా డీఎస్సీలో అన్యాయం జరిగిన అభ్యర్థులకు సంఘీభావ ర్యాలీ



**, ఏపీ బ్యూరో**
సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన వెన్నుపోటుకు రెండేళ్లు ఆందోళనలు నిరసనలు గ్రాండ్ సక్సెస్ అని ఆ పార్టీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలోనూ వెన్నుపోటుకు రెండేళ్లు పేరుతో వైసీపీ పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించింది. మోటార్ సైకిల్ ర్యాలీలు నిర్వహించింది. చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలను ఇచ్చారని అధికారంలోకి వచ్చిన తర్వాత నెరవేర్చకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని వైసిపి నేతలు ఆరోపించారు.రాష్ట్రంలో విద్యార్థులు, నిరుద్యోగులు మహిళలు, రైతులు, ఉద్యోగుల తో సహా అన్ని వర్గాల ప్రజలకు సీఎం చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని వైసీపీ నేతలు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చలేక అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు వెన్నుపోటు పొడచాడని ఇప్పుడున్న సమయంలో కూటమి నాయకులు బయటకు వస్తే ప్రజలు వారిని నిలదీసే పరిస్థితి ఉందంటూ వైసీపీ నేతలు ఎద్దేవా చేశారు. ఇంటింటికి తిరిగి అక్క, వదిన, బావ అని వరసలు కలిపి సూపర్ సిక్స్ పథకాలు అని నట్టేముం చారు. రెండేళ్లు గడచినప్పటికీ కొత్త పెన్షన్లు ఇవ్వలేకున్నారు. జగన్ మోహన్ రెడ్డి అబద్ధాలు చెప్పలేకపోయారు, ప్రజలు చంద్ర బాబు చెప్పిన అబద్ధాలు నమ్మి మోసపోయారని వైసీపీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం నిర్వహించిన అన్యాయం జరిగిన అభ్యర్థులకు సంఘీభావ ర్యాలీలు కూడా వైసీపీ నిర్వహించింది వెన్నుపోటుకు రెండేళ్లు పేరుతో వైసీపీ ఈ నెల నాలుగన ప్రారంభించిన ఆందోళనలు నేటితో ముగిసాయి ఈ ఆందోళనలకు పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యేలు మాజీ మంత్రులు, పార్టీ జిల్లా అధ్యక్షులు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు నేతలు పాల్గొన్నారూ కాగా, వైసీపీ నిర్వహించిన వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమం ఎక్స్ టాక్ టు ట్రైనింగ్ లో ఉందని వైసీపీ ఆ ప్రకటనలో తెలిపింది.

# పాకిస్థాన్ నేవీలోకి కొత్త సబ్‌మెరైన్..

మొదటి తరువాయి

పాల్గొన్నట్లు పాకిస్థాన్ నేవీ ప్రకటన చేసింది.పాకిస్థాన్ నేవల్ అకాడమీకి చెందిన క్యాడెట్లు సంప్రదాయ సెల్యూట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఎన్ జెడ్9ఈసీ హెలికాప్టర్లతో ఫ్లై పాస్ట్ చేపట్టారు. 2015లో కుదిరిన ఒప్పందం ప్రకారం .. చైనాలోనే హ్యాంగర్ క్లాస్ సబ్‌మెరైన్‌ను నిర్మించారు. మొత్తం 8 జలాంతర్గాములను పాకిస్థాన్‌కు అందించాలని గతంలో ఒప్పందం కుదుర్చుకున్నారు. చైనాకు చెందిన సీఎస్ఐసీ కంపెనీ మొదటి నాలుగు సబ్‌మెరైన్లను నిర్మిస్తోంది. మిగితా నాలుగు సబ్‌మెరైన్ల నిర్మాణం, అసెంబ్లింగ్ పాకిస్థాన్‌లో జరుగుతోంది. ట్రాన్స్‌ఫర్ టెక్నాలజీ పద్ధతిలో కరాచీ షిప్‌యార్డులో వాటిని నిర్మించనున్నారు. హ్యాంగర్ అనే పదాన్ని బెంగాలీ నుంచి తీసుకున్నారు. దీనికి షార్క్ అని అర్థం వస్తుంది. 1971 కన్నా ముందున్న పరిస్థితులను గౌరవిస్తూ ఆ పేరు పెట్టినట్లు తెలుస్తోంది. 1971 కన్నా ముందు బంగ్లాదేశ్ .. పాకిస్థాన్‌లో భాగంగా ఉండేది. వాస్తవానికి ఒరిజినల్ హ్యాంగర్‌ను ఫ్రెంచ్ నిర్మిత డఫేన్ క్లాస్ సబ్‌మెరైన్‌గా గుర్తిస్తారు. పాకిస్థాన్ నేవీలో ఆ తరహా అటాక్ సబ్‌మెరైన్లు ఉన్నాయి. అయితే ఆధునిక హ్యాంగర్ క్లాస్ జలాంతర్గాముల్లో చాలా అడ్వాన్స్ ఫీచర్లు ఉంటాయి. వీటికి స్టీల్త్ సామర్థ్యం కూడా ఉంటుంది.

# రప్పా..రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదు


మొదటి తరువాయి



మార్చామని మంత్రి చెప్పారు. రాయలసీమలో రత్నాలు పండేలా చేసిన వ్యక్తి సీబీఎన్ అని కొనియాడారు. గొడ్డలి పార్టీ అరాచక పాలన చూశామన్నారు. టీడీపీ జెండా లేకుండా చేస్తామని నాడు వైసీపీ నేతలు ప్రగల్భాలు పలికారని.. ఇవాళ ప్రజలే వైసీపీ జెండా పీకేసి టీమ్ 11 తీర్పు ఇచ్చారని సెటైర్ విసిరారు. వైసీపీ అరాచకాలు చూస్తూ ఊరుకోమని.. రెడ్‌బుక్ దాని పని అది చేసుకుంటూపోతుందని స్పష్టం చేశారు. రప్పా రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. 'మనది గూగుల్... వాళ్లది గొడ్డలి. మనది ఫైటర్‌జెట్.. వాళ్లది ఫ్యాక్షన్. మనది కియా.. వాళ్లది కిడ్నాప్. మనది క్రెడిబిలిటీ.. వాళ్లది క్రిమినాలిటీ' అంటూ మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై మంత్రి నారా లోకేష్ ప్రశంసలు కురిపించారు. 'ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన వ్యక్తి పవన్ అన్న' అని పేర్కొన్నారు. తనకు సొంత అన్న లేని లోటును పవన్ అన్న తీర్చారన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంతో పోలిస్తే పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. 'ఇప్పుడు ఏపీలో బూతులు లేవు, జేసీబీలు లేవు. అక్రమాలు, దౌర్జన్యాలు కనిపించడం లేదు. ప్రజలకు రెండేళ్లుగా స్వాతంత్ర్యం లభించింది' అని పేర్కొన్నారు. గతంలో తాను చేపట్టిన పాదయాత్రలో దేవుడితో పెట్టుకోవద్దు అని చెప్పానని, ఆ మాటలను పట్టించుకోకుండా వ్యవహరించిన వారి పరిస్థితి ఇప్పుడు అందరికీ కనిపిస్తోందని మంత్రి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లితో పోల్చిన లోకేష్.. ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. వైసీపీ నాయకత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన లోకేష్.. 'టీడీపీ జెండా లేకుండా చేస్తామని చెప్పారు. కానీ ప్రజలే వారి జెండాను పీకేశారు' అని అన్నారు. ప్రస్తుతం కొందరు 'రప్పారప్పా' అంటూ హెచ్చరికలు చేస్తున్నారని.. అయితే తాము చూస్తూ కూర్చోమన్నారు. రెడ్ బుక్ తన పని తాను చేసుకుంటూ పోతుందని హెచ్చరించారు.

# సంపాదకీయం

## బడిలోనే .. దేశ భవిష్యత్‌కు పునాది !



విద్యావైద్యమే పేదరిక నిర్మూలనకు సామాజిక పురోభివృద్ధికి దోహదపడతాయని సిఎం రేవంత్ రెడ్డి నీతి ఆయోగ్‌లో చెప్పిన మాటలు అక్షర సత్యాలు. కులరహిత సమాజానికి ఇది దోహదపడుతుందని కూడా అభిప్రాయపడ్డారు. అయితే ఇది ఎంతవరకు ఆచరణ చేస్తున్నారో ఆత్మపరిశీలన చేసుకునే సమయం వచ్చింది. స్కూళ్లు తెరవబోతున్నారు. గత రెండున్నరేళ్లుగా స్కూళ్లను ఏ మేరకు అభివృద్ధి చేశారో చెప్పాలి. వసతి గృహాలు మృత్యుకుహరాలుగా మారాయి. యంగ్ ఇండియా స్కూళ్లు అంటూ ఊదర గొట్టడం కాకుండా ఉన్న స్కూళ్లను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలి. ఒకవేళ యంగ్ ఇండియా స్కూళ్లు కావాలనుకుంటే..వాటితో పాటు ఉన్న స్కూళ్లను బలోపతేం చేయాలి. స్కూళ్లను హాస్టళ్లను అనుసంధానించడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. దీనిగురించి పట్టించుకోవడం లేదు. పాఠశాలల తో వసతిగృహాలను అనుసంధానించి, సకల సౌకర్యాలు కలిగిస్తే...సిఎం రేవంత్ కోరుకున్న కులరహిత విద్యావిధానం సాధ్యమవుతుంది. అందుకు పెద్దగా పెట్టుబడులు అవసరం లేదు. ఇప్పుడు ఖర్చు చేస్తున్న బడ్జెట్‌లోనే కలెక్టర్లకు ఈ పని అప్పగించి పర్యవేక్షిస్తే సత్వర విజయం సాధించవచ్చు. ఎందుకంటే...స్వేచ్ఛా వాతావరణంలో ఆడుతూ.. పాడుతూ గడపాల్సిన బాలలు పనిలో బందీ అవుతున్నారు. అక్షరాలు దిద్దాల్సిన సమయంలో పత్తి చేలలో పనిచేస్తున్నారు. పుస్తకాల సంచీతో బడికి వెళ్లాల్సిన వారు హోటళ్లు, మెకానిక్ షెడ్లలో కార్మికులుగా మారుతున్నారు.. అక్షరాలు దిద్దాల్సిన చేతులతో బట్టీల్లో ఇటుకలను మోస్తున్నారు. అందుకు తల్లిదండ్రుల పేదరికమే ప్రధాన కారణం. చదువు ప్రాధాన్యంపై వారికి అవగాహన లేకపోవడం, నిరక్షరాస్యత ఇతర కారణాలని చెప్పవచ్చు. పేదరికం బాలల పాలిట శాపంగా మారకుండా ప్రతి ఒక్కరిని బడిలో చేర్పించే బాధ్యత గ్రామాలకు అప్పగించాలి. సర్పంచ్‌లను ఇందుకు బాధ్యులను చేయాలి. ఆర్థిక స్తోమత లేక,కుటుంబ పోషణ భారమై తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి బదులు పనులకు పంపిస్తున్నారు. కొందరు గొర్రెలు, పశు వుల కాపరులుగా మారుతున్నారు. మరికొందరు బాలలు యాచకులుగా వీధుల్లో కనిపించడం ఆవేదన కలిగిస్తోంది. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ఎన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నా పూర్తిస్థాయి ఫలితాలు సాధ్యం కావడం లేదు. పట్టణ శివారు ప్రాంతాల్లో ఇటుక బట్టిల్లో బాలలు కూలీలుగా పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాల రిజిస్టర్‌లో పేర్లు ఉన్నా.. బాలలు మాత్రం పత్తిచేలల్లో, ఇటుకల బట్టీల్లో పని చేస్తుంటారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో ఇలా వందలాది మంది బాల కార్మికులను గుర్తించారు. ఈ క్రమంలో మళ్లీ స్కూళ్లు తెవరబోతున్న క్రమంలో పిల్లల సంఖ్య పెంచాలని విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఒక ప్రణాళిక లేకపోవడం వల్ల వారు పాఠశాల వరకు రాలేకపోతున్నారు. పిల్లలకు ఉచితంగా భోజనం కల్పిస్తున్నా ఆకర్శించలేకపోతున్నారు. ఇందుకోసం గ్రామస్థాయిలో సర్వే చేయిలి. స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలి. ఎందుకంటే దేశ భవిష్యత్ పాఠశాల నుంచే మొదలవుతుంది. ఆరోగ్యకరమైన సమాజం కావాలంటే చదువు కావాలన్న సంకల్పాన్ని నెరవేర్చడం అవసరం. ఇందుకోసం ప్రణాళిక అవసరం. వసతి గృహాల్లో వసతులు లేవు. అలాంటి వాటిని నడిపే బదులు గ్రామాల్లోనే తల్లిదండ్రుల వద్ద పిల్లలను అప్పగించి, స్కూళ్లకు పంపడం నేర్పించాలి. స్కూళ్లో పెన్సిల్ మొదలు, పుస్తకాలు బట్టలు, ఫీజులు ఉచితం చేయాలి. కులమతాలకు అతీతంగా చేసి మంచి భోజన వసతులు స్కూళ్లలోనే కల్పించాలి. అప్పుడు పిల్లలు ఇంటినుంచే స్కూళ్లకు వచ్చేందుకు ఇష్టపడతారు. తల్లిదండ్రులు కూడా ఇందుకు ఒప్పుకుంటారు. ఇది పెద్దగా బడ్జెట్‌తో కూడుకున్న పనికాదు. ఇప్పుడు హాస్టళ్లకు పెడుతున్న ఖర్చుతో దీనిని నెరవేర్చవచ్చు. ఇలా చేస్తే వారే రేపటి పౌరులుగా తయారవుతారు. మనం నేర్పిన నడవడిక, మనం తీర్చిదిద్దిన అక్షరాలు వారి జీవిత గమ్యానికి బాటలు వేస్తాయి. పిల్లలు ఎలా ఎదిగాలి, ఫలితాలు రాబట్టేలా ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించాలి. సమాజాభివృద్ధికి ఉపయోగపడే వ్యక్తిత్వ వికాసాన్ని పిల్లలు పుణికి పుచ్చుకునేలా బడిలోనే పునాది వేయాల్సి ఉంటుంది. గత అనుభవాలను మననం చేసుకుంటూ ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ బడి పట్ల సమాజానికి నమ్మకం కలిగేటట్లు కార్యాచరణ సిద్ధం చేస్తే మంచిది. ఇందుకు తల్లిడదండ్రులను, గ్రామంలో పెద్దలను పలకరిస్తే బోలెడు సమాచారం చెబుతారు. ప్రభుత్వ బడి బాగా నడుస్తుందంటే మన సమాజం బాగుపడ్డట్లుగానే భావించాలి. ఎందుకంటే ఇప్పటికీ ఇంకా ప్రభుత్వ బడి పట్ల నమ్మకం కలిగిన తల్లిదండ్రులు ఈ సమాజంలో ఉన్నారు. వాళ్ళ నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులకు నాలుగు అక్షరాలు, నైతిక విలువలు నేర్పే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాల్సిందే. ఆటంకాలు ఎన్నొచ్చినా ప్రభుత్వం బోధనేతర కార్యక్రమాల చుట్టూ ఉపాధ్యాయులను తిప్పినా.. పిల్లలకు తగు న్యాయం చేయటం కూడా ఉపాధ్యాయుల బాధ్యత. అలాగే పిల్లలకు బోధన చేసే ఉపాధ్యాయులకు స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఒత్తిడి లేకుండా ఉపాధ్యాయులు బడిలో పిల్లలకు బోధన మాత్రమే చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. పాస్ టార్గెట్లు పెట్టడం వల్ల పిల్లలలో సృజనాత్మకత దెబ్బ తింటుంది. బట్టీయ పద్ధతి వల్ల సృజనాత్మకంగా ఆలోచించటం మరచి భవిష్యత్తు అంతా ఎదుటి వాళ్ళ మీద ఆధారపడటం తప్ప తనంతట తను బతకడం అలవాటు లేని పరిస్థితులలోకి నెట్టివేయ బడతారు. ఇవన్నీ అధిగమించాలంటే ప్రభుత్వ సంకల్పమే ముఖ్యం. నీతి ఆయోగ్ సమావేశంలో చెప్పిన అంశాలను ఆచరణలో పెట్టాలి. అందుకు అనుగుణంగా ముందు రాష్ట్రంలోని పాఠశాలల పరిస్థితులను తెలుసుకుని వాటిని బాగు చేయాలి. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపగలిగేలా పరిస్థితుల్లో మార్పు తీసుకుని రావాలి. అలాగే ప్రైవేట్ స్కూళ్ల ఫీజు దోపిడీని కూడా అరికట్టాలి. లక్షల్లో ఫీజులు కట్టడం కోసం తల్లిదండ్రులు నానా యాతన పడుతున్నారు. ఇది తప్పాలంటే ప్రభుత్వ బడులు బలోపేతం కావాలి. అందుకు సంకల్పం ఉంటే మార్పు సాధ్యమే.

# ప్రజలు అధికారంతో పాటు .. అతి పెద్ద బాధ్యత అప్పగించారు

**ప్రజలు ఇచ్చిన తీర్పుతో రాష్ట్ర భవిష్యత్‌కు కొత్త దిశ**
**గ్రామాల అభివృద్ధితోనే దేశం బలపడుతుంది**
**సమస్యలు గ్రామస్థాయిలోనే పరిష్కారం కావడం మేలు**
**సమిష్టి కృషితోనే విశాఖ ఉక్కును కాపాడుకోగలిగాం**
**యువత ఆశయాలు, అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి**
**రెండేళ్ల విజయోత్సవంలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్**



**తిరుపతి, జూన్ 12(డ్రీమ్ టైమ్స్):**
ప్రజాస్వామ్యంలో అంతిమ న్యాయనిర్ణేతలు ప్రజలేనని జనసేన అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు.. రాష్ట్ర భవిష్యత్‌కు కొత్త దిశను చూపిన చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ప్రజలు రెండేళ్ల క్రితం కేవలం అధికారాన్ని మాత్రమే కాకుండా బాధ్యతను కూడా అప్పగించారని చెప్పారు. ఆ బాధ్యతను నెరవేర్చేందుకు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు సమిష్టిగా కృషి చేస్తున్నాయని తెలిపారు. గ్రామమే దేశ అభివృద్ధికి కేంద్ర బిందువని పేర్కొన్న పవన్.. పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరి భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలు గ్రామ పంచాయతీల స్థాయిలోనే జరగాలని అన్నారు. గ్రామంలో పరిష్కరించాల్సిన సమస్యలు మండల, జిల్లా లేదా ఎమ్మెల్యే స్థాయికి వెళ్లకుండా స్థానికంగానే పరిష్కారం కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రస్తుతం ప్రతి చిన్న సమస్య కూడా ఎమ్మెల్యేల వద్దకు వెళ్తోందని, రాష్ట్రంలో ఉన్న వందలాది స్థానిక ప్రజాప్రతినిధుల అధికారాలను బలహీనపరిచి, మొత్తం వ్యవస్థను ఎమ్మెల్యేల చుట్టూ కేంద్రీకరించడం సరికాదన్నారు. వ్యవస్థలు బలహీనపడితే కులాలు, ప్రాంతీయ భావాలు బలపడతాయని హెచ్చరించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను అడ్డుకోవడంలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమిష్టి ప్రయత్నాలు ఫలించాయని పవన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజా తీర్పు ఒక తరం భవిష్యత్‌కు నమ్మకాన్ని ఇచ్చిందని, రాష్ట్ర అభివృద్ధి, యువత భవిష్యత్, ఉపాధి అవకాశాల కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ప్రజలు మౌనంగా ఉన్నా సరైన సమయంలో తమ తీర్పుతో చరిత్రను మార్చగలరని 2024 ఎన్నికలు మరోసారి నిరూపించాయని పేర్కొన్నారు. అహంకారం, విధ్వంసక రాజకీయాలపై ప్రజాస్వామ్యం సాధించిన విజయమే 2024 ఎన్నికల ఫలితమని పవన్ అభిప్రాయపడ్డారు. అధికారం పంచుకోవడం కోసం కాకుండా బాధ్యతను పంచుకుని రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి పనిచేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగానే గ్రామ స్వరాజ్యం, స్థానిక సంస్థల బలోపేతం, ప్రజాస్వామ్య వికేంద్రీకరణపై పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేన పార్టీ కేవలం 21 సీట్లకే పరిమితమైందంటూ విమర్శలు చేశారని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆ రోజు తాము చేసిన రాజకీయ త్యాగమే కూటమి విజయానికి పునాది అయిందని అన్నారు. తెలుగు రాష్ట్రాలు మరింత అభివృద్ధి చెందాలంటే కుల, ప్రాంతీయ పరిమితులను దాటి జాతీయ అభివృద్ధి దిశగా ఆలోచించాలని సూచించారు. గ్రామాలకు నిర్ణయాధికారం, బాధ్యతలు పూర్తిస్థాయిలో చేరాయా అనే అంశంపై ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు స్వీకరించినప్పుడు బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేయడానికి, జాతీయ పండుగలు నిర్వహించడానికి కూడా నిధులు లేవని అధికారులు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితిని 'బ్రోకెన్ గవర్నెన్స్'గా అభివర్ణించారు. గ్రామాల్లో రోడ్లు ఎక్కడ వేయాలి? ఎవరికి ఇళ్లు అవసరం వంటి నిర్ణయాలు కార్యాలయాల్లో కాకుండా ప్రజల మధ్య గ్రామసభల్లో తీసుకోవాలని పవన్ పేర్కొన్నారు.

# మౌలిక సదుపాయాల అభివృద్ధియే లక్ష్యం

**- - మేయర్ కొలగాని శ్రీనివాస్**



**కరీంనగర్, జూన్ 12(డ్రీమ్ టైమ్స్):**
నగరపాలక సంస్థ పరిధిలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ మేయర్ కొలగాని శ్రీనివాస్ పలు పనులకు శంకుస్థాపన చేశారు. 1వ డివిజన్ అరెపల్లిలో రూ.27 లక్షల వ్యయంతో సీసీ డ్రైన్, సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ పనుల ద్వారా ప్రజలకు మెరుగైన రహదారి, డ్రైనేజీ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అనంతరం 26వ డివిజన్‌లో పూడికతీత పనులను ప్రారంభించి వర్షాకాలానికి ముందే కాలువల్లో నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.నగర అభివృద్ధే లక్ష్యంగా ప్రతి డివిజన్‌లో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు నగరపాలక సంస్థ నిరంతరం పనిచేస్తోందని మేయర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ కార్పొరేటర్ బారి అపర్ణ జితేందర్, 26వ డివిజన్ కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్, కార్పొరేటర్ బండారి వేణు, కో-ఆప్షన్ సభ్యులు చిగిరి వెంకటమ్మ, సరిల్ల ప్రసాద్, కొంపల్లి రమణ్, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు, డివిజన్ వాసులు పాల్గొన్నారు. ప్రతి డివిజన్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యంగా పనులు వేగవంతం చేస్తున్నామని మేయర్ స్పష్టం చేశారు.

# అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు

**కరీంనగర్ రూరల్, జూన్ 12(డ్రీమ్ టైమ్స్):**
గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో పోలీసులు రెండు ట్రాక్టర్లను అక్రమ ఇసుక రవాణా చేస్తూ పట్టుకున్నారు.చేగుర్తి గ్రామానికి చెందిన చామనపల్లి శ్రీనివాస్ మానేరు వాగు నుండి ఇసుకను దొంగలించి ట్రాక్టర్‌లో కరీంనగర్ వైపు తరలిస్తుండగా తీగలగుట్టపల్లి వద్ద పోలీసులు పట్టుకున్నారు. అలాగే కిసాన్ నగర్‌కు చెందిన వీర్ల సంపత్ మానేరు వాగు నుండి ఇసుకను తరలిస్తుండగా బొమ్మకల్ గ్రామంలోని చల్మెడ ఆసుపత్రి వద్ద పోలీసులు అడ్డుకున్నారు.అట్టి ట్రాక్టర్లను సీజ్ చేసి నిందితులపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, సస్పెక్ట్ షీట్లు తెరుస్తామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు.

# దుబాయిలో బుర్జీల్ ప్రతినిధులను ఎమ్మెల్యే సత్యం భేటి




**కరీంనగర్, జూన్ 12(డ్రీమ్ టైమ్స్):**
దుబాయిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏడుగురు కార్మికులు, గాయపడిన తొమ్మిది మందికి బుర్జీల్ హోల్డింగ్స్ చైర్మన్ డా. షంషీర్ వయలిల్ ప్రకటించిన రూ. 2.60 కోట్ల మానవతా సహాయ ప్యాకేజీపై చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృతజ్ఞతలు తెలిపారు.డా. షంషీర్ అందుబాటులో లేకపోవడంతో ఆయన కంపెనీ ప్రతినిధులను దుబాయిలో కలిసిన ఎమ్మెల్యే సత్యం, సహాయం కోసం కృతజ్ఞతలు తెలిపారు. ఒక్కో మృతుడి కుటుంబానికి రూ. 26 లక్షలు, గాయపడిన వారికి వైద్య చికిత్స, పునరావాసం, పిల్లల విద్య కోసం సహాయం అందించనున్నట్లు ప్రకటించారు.ఎమ్మెల్యే సత్యం బుర్జీల్ ప్రతినిధులను హైదరాబాద్‌కు ఆహ్వానించి, సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో చెక్కులు అందజేయాలని ప్రతిపాదించారు. అంతకుముందు ఆయన భారత కాన్సులేట్ అధికారులను కలసి మృతదేహాల తరలింపు వేగవంతం చేయాలని కోరారు, రషీద్ ఆసుపత్రిలో గాయపడిన వారిని పరామర్శించారు.ఈ కార్యక్రమంలో ఎన్నారై అడ్వయిజరీ కమిటీ సభ్యులు, తెలంగాణ సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 26 లక్షల సహాయం అందనున్నది.

# సంక్షేమ శాఖల్లో అవినీతి నిరూపిసే సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్

**హుస్నాబాద్‌జూన్ 12(డ్రీమ్ టైమ్స్):**
సంక్షేమ శాఖల్లో అవినీతి జరిగిందని మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు.మైనార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల్లో పారదర్శకతతోనే నిర్ణయాలు తీసుకుంటున్నామని, మంత్రులకు సంబంధం లేకుండా ప్రిన్సిపల్ సెక్రటరీల ఆధ్వర్యంలోనే వ్యవహారాలు జరుగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. హరీష్ రావు అవగాహన లేకుండా మాట్లాడి తన స్థాయి తగ్గించుకుంటున్నారని విమర్శిస్తూ, గత ప్రభుత్వంలో జరిగినట్లుగా అవినీతి జరుగుతుందనే భావన తప్పు అని అన్నారు.అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి మాట్లాడుతూ, సంక్షేమ శాఖల్లో అవినీతి నిరూపిస్తే దేనికైనా సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. పేదల విద్య, నాణ్యమైన ఆహారం కోసం మాత్రమే మేము కృషి చేస్తున్నామని, మా శాఖల్లో తప్పు జరిగిందని నిరూపిస్తే ఎలాంటి విచారణకైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని ఆయన పేర్కొన్నారు.హరీష్ రావు ఆరోపణలు నిరాధారమని, అవినీతి నిరూపిస్తే దేనికైనా సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు.

# 'సర్' కొత్తగా..!

- ఓటర్ల జాబితా సమగ్ర సవరణకు కార్యాచరణ
- ఈనెల 15 వ తేదీ నుంచి ఇంటింటికీ వెళ్లనున్న బిఎల్వోలు
- గుంతకల్లు నియోజకవర్గం లో పోలింగ్ కేంద్రాలు: 276
- మొత్తం ఓటర్లు :2,74,786 మంది
- పురుషులు : 1,34,642 మంది
- మహిళలు :1,40,067 మంది
- ఇతరులు : 77 మంది




**గుంతకల్లు, జూన్ 12(డ్రీమ్ టైమ్స్):** గుంతకల్లు నియోజకవర్గంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) కు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే రాజకీయ పార్టీలకు షెడ్యూల్ ప్రక్రియను యంత్రాంగం అందించింది. గుంతకల్లు నియోజకవర్గం లో 276 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం ఓటర్లు 2,74, 786 మంది ఉన్నారు. ఇందులో 1,34,642 మంది పురుషులు కాగా, 1,40,067 మంది మహిళలు, 77 మంది ఇతరులు ఉన్నారు.జూన్ 15 నుంచి జూలై 14 వ తేదీ వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలపై ఆరా తీస్తారు. 2002 నాటి ఓటర్ల జాబితా ప్రాతిపదికన వివరాలను పరిశీలించి, ఓటర్లకు రెండు రకాల ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారు. ఓటరు వాటిని వెంటనే పూర్తి చేసి ఇవ్వొచ్చు. లేకపోతే తర్వాత నైనా పూర్తిచేసి ఇవ్వొచ్చు. తరువాత అర్హులైన ఓటర్ల నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తారు. కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ బూత్ పరిధిలోకి వచ్చేలా ప్రస్తుత విధానంలో చర్యలు చేపడుతున్నారు. ఇంటి నంబరు ఆధారంగా జియో ట్యాగింగ్ విధానంలో బిఎల్వోలు మార్కింగ్ వేయనున్నారు.

**షెడ్యూల్ ఇలా:**


ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించి బూత్ స్థాయి అధికారులకు జూన్ 5 వ తేదీ నుంచి 14వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాజకీయ పార్టీలు నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల వారిగా భూ ఏజెంట్లను నియమించుకోవాలి. జూన్ 15 వ తేదీ నుంచి జూలై 14వ తేదీ వరకు బిఎల్ఓ లు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలిస్తారు. జూలై 14 వ తేదీన పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ, 21 వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన, అప్పటినుంచి ఆగస్టు 20వ తేదీ వరకు ముసాయిదా జాబితా పై అభ్యంతరాలు స్వీకరించి సెప్టెంబరు 18 వ తేదీ లోగా వాటిని పరిష్కరించాలి.22 వ తేదీన తుది జాబితా ప్రకటించనున్నారు.

**జూలై 1 తరువాత అర్హత తేదీ:**

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణకు అర్హత తేదీగా 2026, జూలై 1 గా నిర్ణయించారు. జూలై 1 నాటికి 18 సంవత్సరాలు నిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చు.

# కొత్త ధ్రువపత్రాల జారీ

**- మీసేవ, సచివాలయాలకు చేరిన స్టేషనరీ**




**గుంతకల్లు, జూన్ 12(డ్రీమ్ టైమ్స్):** మీసేవ, గ్రామ, వార్డు సచివాలయాల్లో జారీ చేస్తున్న వివిధ ధ్రువపత్రాల స్టేషనరీని ప్రభుత్వం మార్పు చేసింది. ఇప్పటివరకు ధ్రువపత్రాల పై భాగంలో గ్రామ, వార్డు సచివాలయం శాఖ అనే పేరు ఉండేది. గత వైసిపి ప్రభుత్వ హయాంలో పెట్టిన ఈ పేరును ఇటీవల ప్రభుత్వం స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు శాఖగా మార్చింది. దీంతో పాత పేరుతో ఉన్న స్టేషనరీ ని పూర్తిగా రద్దుచేసి ఈనెల 10వ తేదీ బుధవారం నుంచి కొత్త స్టేషనరీపై ధ్రువపత్రాల జారీ చేయాల్సిందిగా ఈ ఎస్ డి డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పరిధిలో ఉన్న అన్ని మీసేవ, సచివాలయాల్లో ఉన్న డిజిటల్ ఆపరేటర్లకు మూడు రోజుల నుంచి కొత్త స్టేషనరీ పంపిణీ చేశారు. పాత స్టేషనరీ ని కూడా వెనక్కి తీసుకుంటున్నారు పాత స్టేషనరీ పై ధ్రువపత్రాలను జారీ చేస్తే ఐడీలను బ్లాక్ చేస్తామని, కొత్త స్టేషనరీ ని మాత్రమే ఉపయోగించాలని గట్టి ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ఇప్పటికే అన్ని మీ సేవా కేంద్రాలకు కొత్త స్టేషనరీ అందజేశారు.

**మ్యాపింగ్ చేసి:**

ప్రస్తుతం కొత్తగా ముద్రించిన స్టేషనరీ పై రాజముద్రతో పాటు హాలో గ్రామ్ ను ఏర్పాటు చేశారు. కొత్తగా ఇచ్చిన స్టేషనరీని మీసేవ కేంద్రాల వారీగా మ్యాపింగ్ చేశారు. దీనివల్ల ఎక్కడైనా తప్పుడు ధ్రువపత్రాలు జారీ చేస్తే క్షణాల్లో గుర్తించే అవకాశం ఉంటుంది. ఇదేవిధంగా ధ్రువపత్రం వెనుక వైపు కూడా క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేశారు. స్కాన్ చేస్తే ధ్రువపత్రం జారీచేసిన కేంద్ర వివరాలు తెలుసుకోవచ్చు.

# తొలిరోజే విద్యార్థులకు 'స్టూడెంట్ కిట్ల' పంపిణీ






--లివేసవి సెలవుల తర్వాత ఘనంగా పునఃప్రారంభమైన ప్రభుత్వ పాఠశాలలు

--విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలికిన ఉపాధ్యాయులు

--ప్రభుత్వ వసతులను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి: ప్రెస్ నోట్‌లో ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్ పిలుపు.

-పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, యూనిఫాంలతో కూడిన కిట్ల అందజేత; క్లాస్‌రూమ్‌లలో వెల్లివిరిసిన సరికొత్త ఉత్సాహం.

**తనకల్లు జూన్ 12 డ్రీమ్ టైమ్స్ న్యూస్** వేసవి సెలవుల అనంతరం శుక్రవారం ప్రభుత్వ పాఠశాలలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో పునఃప్రారంభమయిన సందర్భంగా తనకల్లు మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కూడా పాఠశాల తొలిరోజే విద్యార్థులందరికీ ప్రభుత్వం అందించిన ప్రత్యేక స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కిట్లలో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు, యూనిఫాంలు, షూలు, బెల్టులు తదితర అవసరమైన వస్తువులను అందజేశారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ రవిచంద్ర ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఈ వస్తువులను విద్యార్థులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భాస్కర్, వైస్ చైర్మన్ నాగమణి, కమిటీ మెంబర్ షాహీర్ బాబా, ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు యుగంధర్ రెడ్డి, నాగార్జున, జునైద్, పద్మనాభ రెడ్డిలతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలికారు. వేసవి సెలవుల అనుభవాలను అడిగి తెలుసుకుంటూ క్లాస్‌రూమ్‌లలో ఆహ్లాదకర వాతావరణాన్ని సృష్టించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఉచిత కిట్లను, వసతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సరికొత్త లక్ష్యాలతో, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. చదువుతో పాటు నైతిక విలువలు, శారీరక దృఢత్వం కూడా ముఖ్యమని ఉపాధ్యాయులు విద్యార్థుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు.

# విమల స్కూల్ లో ఘనంగా మనబడి మన పండుగ.



**శిరివెళ్ళ. (డ్రీమ్ టైమ్స్)** మండల పరిధిలోని గోవిందపల్లె గ్రామంలో గల విమల స్కూల్ లో విద్యా సంవత్సరం పునః ప్రారంభం సందర్భంగా ప్రిన్సిపల్ గీతా సిస్టర్ ఆధ్వర్యంలో మనబడి మన పండుగ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విమల స్కూల్ లో ప్రతి విద్యార్థికి ఆహ్లాదకరమైన స్వాగతం పలుకుతూ నూతన విద్యా సంవత్సరాన్ని విజయవంతంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థినీ విద్యార్థులకు ఒక పండుగ వాతావరణంలో అక్షరాభ్యాసం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ గీతా సిస్టర్ తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలలో అక్షరాలు పదాలు వాక్యాలు కూర్పులు వరకు నేర్పడమే చదువు కాదని అది ఒక భాగం మాత్రమే అని సమాజాన్ని చదవడం ఎలాగో సమాజంలో నిజాయితీగా ఉన్నతంగా ఎదగడం ఎలాగో సంపూర్ణ జ్ఞానాన్ని అందించడం కూడా ఎంతో అవసరం అన్నారు. ప్రకృతికి మనిషికి ఉన్న సంబంధాన్ని అనుబంధాన్ని నిరంతరం నేర్పుతూ రెక్కలు రాని చిన్నారి పక్షికి గూటిలో తల్లి రక్షణ కల్పించినట్లు బడిలో చిన్నారులకు రక్షణ అందించే తల్లి పక్షుల్లా ఉపాధ్యాయులు ఉంటారని అన్నారు. సమాజం పట్ల బాధ్యతగా మెలిగే పౌరులుగా తీర్చిదిద్దుతూ చిన్నారులకు అక్షర జ్ఞానాలు నేర్పుతూ వారి భవిష్యత్తుకు పునాది వేస్తున్నామని ప్రిన్సిపాల్ తెలియజేశారు.

# నిధుల మళ్లింపు పట్ల సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నేతల ఆక్షేపణ

- గుంతకల్లు మున్సిపల్ సాధారణ నిధులనుండి రూ.5 కోట్లను రైల్వే పనులకు మళ్లించొద్దని మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ కు, మున్సిపల్ ఇంచార్జి కమిషనర్ లక్ష్మీదేవి కి వినతిపత్రం అందజేత



గుంతకల్లు ఆర్డిఓ,మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నేతలు



**గుంతకల్లు, జూన్ 12(డ్రీమ్ టైమ్స్):** గుంతకల్లు మున్సిపాలిటీ సాధారణ నిధుల నుండి రైల్వే పనులకు నిధులను మళ్లిస్తుండడం పట్ల స్థానిక సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నేతలు తీవ్ర ఆక్షేపణ వెలిబుచ్చారు. ఈ మేరకు శుక్రవారం వారు నిధుల మళ్లింపును ఆపాలని కోరుతూ గుంతకల్లు ఆర్డీఓ, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ ఏబీవీఎస్. శ్రీనివాస్, మున్సిపల్ ఇంచార్జి కమిషనర్ లక్ష్మీదేవికి వేర్ వే రుగా కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గుంతకల్లు డివిజన్ కమిటీ కార్యదర్శి బి. సురేష్ మాట్లాడుతూ.. పట్టణంలోని ధర్మవరం గేట్ సమీపంలో మంజూరైన రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్ యు బి) నిర్మాణానికి ప్రభుత్వం నుండి గాని, స్థానిక ఎమ్మెల్యే ద్వారా గాని మ్యాచింగ్ గ్రాంటును సాధించే ప్రయత్నం చేయకుండా మున్సిపల్ అధికారులు జనరల్ ఫండ్ నుండి దాదాపు రూ.5 కోట్ల నిధులను మళ్లించేందుకు పూనుకోవడం సరైంది కాదన్నారు. గ్రేడ్ వన్ స్థాయి మున్సిపాలిటీ అయిన గుంతకల్లు పట్టణంలో 37 వార్డుల్లో ప్రజల నుండి ఇంటి పన్ను, కొళాయి పన్ను, టౌన్ ప్లానింగ్ పర్మిషన్ వంటి వాటి ద్వారా వసూలైన మొత్తాన్ని ప్రజల మౌలిక వసతుల కల్పనకు వినియోగించాల్సి ఉందన్నారు. అయితే ధర్మవరం గేటు సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్ యు బి) నిర్మాణానికి మున్సిపల్ సాధారణ నిధుల నుండి రూ.5 కోట్లను మళ్లించేందుకు మున్సిపల్ అధికారులు యత్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎట్టి పరిస్థితులను మున్సిపల్ సాధారణ నిధులను రైల్వే పనులకు మళ్లించొద్దని ఆయన కోరారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్థానిక ఎమ్మెల్యే ద్వారా గాని, ప్రభుత్వం ద్వారా గాని రైల్వే బ్రిడ్జి పనులకు అవసరమైన మ్యాచింగ్ గ్రాంట్ ను సాధించే దిశగా చొరవ చూపాలని ఆయన చెప్పారు. లేనిపక్షంలో ఆందోళన నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గుంతకల్ డివిజన్ కమిటీ కార్యదర్శి బి. సురేష్, కమిటీ సభ్యులు రఘునాథ్ రెడ్డి, రామాంజనేయులు, ఐఎఫ్టియు పట్టణ కార్యదర్శి రాందాస్, సభ్యులు నారాయణ, షెక్షావలి, బాషా, మస్తాన్, నెట్టెప్ప తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ మోడల్ స్కూల్ శిరివెళ్లలో ఘనంగా విద్యా సంవత్సరం ప్రారంభం:



**శిరివెళ్ళ.(డ్రీమ్ టైమ్స్)** ఏపీ మోడల్ స్కూల్, సిరివెళ్లలో 2026--27 విద్యా సంవత్సరాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, యామ గురప్ప .ఎస్ఎంసీ చైర్మన్ శ్రీమతి లావణ్య తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు క్రమశిక్షణ, పర్యావరణ పరిరక్షణ, విద్య యొక్క ప్రాముఖ్యత గురించి విలువైన సందేశాలను అందించారు.వినూత్న కార్యక్రమంగా ఆరవ తరగతిలో ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపికైన విద్యార్థులతో మొక్కలు నాటించారు. ప్రతి విద్యార్థి తన మొక్కకు ఒక ట్యాగ్ కట్టి, దానిపై తన పేరు మరియు భవిష్యత్తులో తాను ఏమవ్వాలనుకుంటున్నాడో రాశారు. ఆ మొక్కను ప్రతిరోజూ సంరక్షిస్తూ పెంచాలని, మొక్క ఎదిగినట్లే తమ జీవితాలు కూడా ఉన్నత స్థాయికి ఎదగాలని సంకల్పించారు.పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యలోనూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచిస్తూ, ఈ వినూత్న కార్యక్రమంతో నూతన విద్యా సంవత్సరానికి శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డా. ఇష్రత్ బేగం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రక్తదానం చేసిన గుంతకల్లు తహాశీల్దారు రమాదేవి




**గుంతకల్లు, జూన్ 12(డ్రీమ్ టైమ్స్):** రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం గుంతకల్లు పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక తహాశీల్దారు ఎస్. రమాదేవి రక్తదానం చేశారు. రక్తదాతల దినోత్సవం గుంతకల్లు రెవెన్యూ డివిజనల్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎస్. హరిప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి బ్లడ్ బ్యాంకులో తహాశీల్దార్ ఎస్. రమాదేవితో పాటు రెవెన్యూ కార్యాలయ సిబ్బంది కూడా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా తహ శీల్దారు రమాదేవి మాట్లాడుతూ అన్ని దానాలలో కన్నా రక్తదానం మిన్న అని పేర్కొన్నారు 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంతేకాకుండా రక్తదానం చేయడం వల్ల ఒక రెండు ప్రాణాన్ని కాపాడిన వారమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అజయేంద్ర రావు, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ పవిత్ర ప్రజ్ఞ, ల్యాబ్ టెక్నీషియన్లు సత్య, ఉమా సాయి, మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ప్రభాకర్, మున్సిపల్ అధికారులు వినయ్ కుమార్, ఆదినారాయణ, సురేంద్ర పాల్, కిషోర్, శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది జాషువా, హేమ్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**- డీడబ్ల్యూఓ సరస్వతి**



**కరీంనగర్, జూన్ 12(డ్రీమ్ టైమ్స్):** ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, పోలీసు శాఖ, జిల్లా న్యాయ సేవా సంస్థ సమన్వయంతో కరీంనగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, కార్మిక శాఖ అధికారి ప్రసాద్ ర్యాలీని జిల్లా పరిషత్ కార్యాలయం నుండి ప్రారంభించారు. గీతాభవన్ చౌరస్తా వరకు కొనసాగిన ర్యాలీ సందర్భంగా దుకాణాలు, వాణిజ్య సంస్థలలో ఆకస్మిక తనిఖీలు చేసి బాల కార్మికులు పనిచేస్తున్నారా అని పరిశీలించారు. బాల కార్మికులు లేని దుకాణాలకు బాల కార్మికుల రహిత దుకాణం స్టిక్కర్లు అంటించారు. ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు సమాచారం అందించాలని అధికారులు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు రేండ్ల కళింగ శేఖర్, జిల్లా న్యాయ సేవా సంస్థ ప్రతినిధి చంద్రప్రకాశ్ రెడ్డి, సీడీపీఓలు, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సంపత్, బాలల పరిరక్షణ సిబ్బంది, కార్మిక శాఖ అధికారులు, పోలీసు టాస్క్ ఫోర్స్ పాల్గొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు.

# చిట్‌ఫండ్ కంపెనీలపై న్యాయవాది ఫిర్యాదు

**కరీంనగర్, జూన్ 12(డ్రీమ్ టైమ్స్):** జిల్లాలోని కొన్ని చిట్‌ఫండ్ సంస్థలు, ముఖ్యంగా కపిల్, మార్గదర్శి చిట్‌ఫండ్స్ అమలు పిటిషన్లలో చట్టబద్ధమైన విధానాలను పాటించడం లేదని ఆరోపిస్తూ న్యాయవాది ఎ.వి. రమణ జిల్లా ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదు చేశారు. నోటీసులు సక్రమంగా జారీ చేయకుండా, చందాదారులు మరియు షూరిటీలకు వాదనలు వినిపించే అవకాశం ఇవ్వకుండా వారెంట్లు పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని, అమాయక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చిట్‌ఫండ్ కంపెనీలు దాఖలు చేస్తున్న అమలు పిటిషన్లలో నోటీసుల జారీ, సర్వీస్ విధానం, వారెంట్ల జారీ ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపి చట్టబద్ధమైన విధానాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం చిట్‌ఫండ్ సంస్థలపై న్యాయవ్యవస్థ ప్రత్యేక దృష్టి సారించాలని న్యాయవాది ఎ.వి. రమణ కోరారు.

# సిబిఎఫ్సి అడ్వైజరీ మెంబర్‌గా కొమ్మెర రవీందర్ రెడ్డి నియామకం



**కరీంనగర్, జూన్ 12(డ్రీమ్ టైమ్స్):** సెంట్రల్ బోర్డ్ ఫిలిం సర్టిఫికేషన్ అడ్వైజరీ మెంబర్‌గా నియమితులైన కొమ్మెర రవీందర్ రెడ్డిని శాన్వి డిఫెన్స్ విద్యాసంస్థల చైర్మన్ ఎర్రం శెట్టి మునీందర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొని అభినందనలు తెలిపారు. విద్యార్థులను ఉద్దేశించి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ కలల పట్ల ఆసక్తి, సృజనాత్మకత, సమాజ స్పృహతో అర్థవంతమైన విద్యను నేర్చుకోవాలని సూచించారు. దేశభక్తి, శ్రద్ధలను విద్యార్థి దశ నుంచే అలవర్చుకుంటే భారతదేశం జగద్గురు స్థానంలో నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. సిబిఎఫ్సి మెంబర్‌గా నియమితులైన కొమ్మెర రవీందర్ రెడ్డికి శాన్వి డిఫెన్స్ అకాడమీ ఘన సన్మానం చేసింది.

# ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమం



**కరీంనగర్, జూన్ 12(డ్రీమ్ టైమ్స్):** సప్తగిరి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డివిజన్ కార్పొరేటర్ చాడగొండ కవితా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రజలు తప్పకుండా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో ఆధునిక వసతులు, విశాలమైన ఆటస్థలం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని, నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని ఆమె పేర్కొన్నారు. స్థానిక నాయకుడు చాడగొండ బుచ్చిరెడ్డి కూడా ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రజలను ప్రోత్సహించారు. ప్రధానోపాధ్యాయుడు మురుమూరి రాజేందర్ మాట్లాడుతూ జూన్ 15న పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నాయని, కావలసిన పుస్తకాలు, నోటుపుస్తకాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఐఎఫ్పి ప్యానెల్స్‌తో నూతన తరగతి గదులు, ఆధునిక సాంకేతిక బోధన కొనసాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ, ఉపాధ్యాయులు గాజుల రవీందర్, తూముల తిరుపతి, సిహెచ్ శ్రీనివాస్, జి. ప్రసాద్ రావు, శంకరయ్య, భారతి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని కార్పొరేటర్ కవితా బుచ్చిరెడ్డి పిలుపునిచ్చారు.

# రెండేళ్ల పాలన లో కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని చూరగొంది..!

**- తిరుపతిలో జరిగిన కూటమి విజయోత్సవ కార్యక్రమంలో.. ఏపీ వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ తుల్జాపూర్ స్వప్న**



**అనంతపురం (గుంతకల్లు), జూన్ 12,(డ్రీమ్ టైమ్స్):** రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండేళ్ల పాలనలో ప్రజల విశ్వాసాన్ని చూరగొందని అనంతపురం టిడిపి మహిళా నేత, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్ పర్సన్ తుల్జాపూర్ స్వప్న సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు కూటమి పాలన రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని తిరుపతిలో శుక్రవారం నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో తుల్జాపూర్ స్వప్న హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె కార్యక్రమాన్ని ఉద్దేశించి 'డ్రీమ్ టైమ్స్' ప్రతినిధితో శుక్రవారం రాత్రి ఫోన్ లో మాట్లాడారు. బిజెపి, జనసేన పార్టీల భాగస్వామ్యంతో ఎన్నికల్లో పోటీ చేసి అధికారంలోకి వచ్చిన టిడిపి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అన్నింటిని ఒకటొకటిగా త్వరితగతిన నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ఒక్క కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. అంతేకాకుండా రెండేళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంలో ఇదే నెలలో ప్రజలకు కొత్తగా సామాజిక పింఛన్లు మంజూరు, రైతులకు అన్నదాత సుఖీభవ, విద్యార్థులకు తల్లికి వందనం వంటి పథకాలను ప్రారంభిస్తుండడం కూడా సంతోషదాయకంగా ఉందన్నారు. దీంతో ప్రజల్లో మరింత నమ్మకం, విశ్వాసం పెరుగుతోందన్నారు. రానున్న మూడేళ్లలో రాష్ట్రంలో మరింత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అనేకం కొనసాగుతాయని ఆమె స్పష్టం చేశారు.

# రెండేళ్ల పాలనలో.. ప్రజలకు మిగిలింది వెన్నుపోటే..!





**- కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన గుంతకల్లు తాజా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, వైసిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి**

**గుంతకల్లు, జూన్ 12(డ్రీమ్ టైమ్స్):** ప్రజలకు ఎన్నో ఆశలు చూపి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తన రెండేళ్ల పాలనలో వెన్నుపోటు పొడిచిందే తప్ప.. మేలు చేసిందంటూ ఏమీ లేదని గుంతకల్లు తాజా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, వైసిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు రాష్ట్రంలో కూటమి పాలన రెండేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు' పేరిట రాష్ట్రవ్యాపిత నిరసన ర్యాలీ కార్యక్రమం పిలుపుమేరకు గుంతకల్లులో గుంతకల్లు తాజా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, వైసిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు శుక్రవారం పట్టణంలో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ముందుగా పట్టణంలోని వైసిపి మాజీ ఎమ్మెల్యే వై. వెంకట్రామిరెడ్డి క్యాంపు కార్యాలయం నుండి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం, అంబేద్కర్ విగ్రహం మీదుగా పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి నైరుతిరెడ్డి ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకొని రాష్ట్ర ప్రజలు గడిచిన ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించారన్నారు. అయితే ప్రజల ఓట్లతో గెలిచిన కూటమి ప్రభుత్వం గద్దెనెక్కాక ఎన్నికల హామీలను తుంగలో తొక్కి ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని కూడా సక్రమంగా అమలు చేసిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటి కూడా సక్రమంగా నెరవేరలేద న్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు లేవు.. నిరుద్యోగ భృతి లేదు.. రైతులకు భరోసా లేదు.. మహిళలకు రక్షణ లేదు.. విద్యార్థులకు భవిష్యత్తు లేదు అని విమర్శించారు. ఇది కార్మికుల పొట్ట కొట్టే ప్రభుత్వం అన్నారు. మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువత ను నమ్మించి దగా చేసి నట్టేట ముంచి వెన్నుపోటు పొడిచిందన్నారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వైసిపి ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు, పోరాటాలు ఉధృతం చేస్తామని ఆమె స్పష్టం చేశారు.

# ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని తపస్ డిమాండ్



**కరీంనగర్,జూన్ 12(డ్రీమ్ టైమ్స్):** : ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కోట్ల కాశిరావు, ప్రధాన కార్యదర్శి పూజారి రమేశ్ డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు 2025 సెప్టెంబర్ 1న ఇచ్చిన తీర్పు, అనంతరం 65 రివ్యూ పిటిషన్లను కొట్టివేసి 2028 ఆగస్టు 31 వరకు చివరి అవకాశాన్ని ఇచ్చిన తీర్పు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు అన్యాయం చేస్తున్నదని వారు పేర్కొన్నారు. తెలంగాణలో 30 వేల మంది ఉపాధ్యాయులు టెట్ పాస్ కావాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. భాషా ఉపాధ్యాయులు, ఇతర సబ్జెక్టు ఉపాధ్యాయులు తమ బోధనకు సంబంధం లేని సబ్జెక్టులు చదివి పరీక్షలు రాయాల్సిన పరిస్థితి ఉందని, ఇది అసంబద్ధ నిర్ణయమని తపస్ అభిప్రాయపడింది. ఇప్పటికే ఎస్సిఆర్టి, ఎస్సిఈఆర్టి ఆధ్వర్యంలో దీక్ష, నిష్ఠ వంటి ఆన్లైన్ శిక్షణలు అందుతున్నాయని, ఉపాధ్యాయులు సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా నేర్చుకుంటున్నారని వారు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకువచ్చి 2010 ఏప్రిల్ 1కు ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రాన్ని ఒప్పించేలా చర్యలు తీసుకోవాలని తపస్ డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో తపస్ రాష్ట్ర బాధ్యులు సత్తారి రాజిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పట్నం కృష్ణ, మంచాల మండల అధ్యక్షుడు రావుల శివకుమార్, ప్రధాన కార్యదర్శి కావలి దత్తాత్రేయ, కోశాధికారి చీర బలరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు కోసం తపస్ కేంద్రాన్ని ఆర్డినెన్స్ తీసుకురావాలని డిమాండ్ చేసింది.

# సిఎస్ఐ స్కూల్లో అలింకో క్యాంప్

**-అర్హులైన పిల్లలకు టీఎల్ఎం కిట్లు, హియరింగ్ ఎయిడ్, వీల్‌చైర్లు పంపిణీ**




**నందికొట్కూరు, జూన్ 12(డ్రీమ్ టైమ్స్):** నందికొట్కూరు మండలంలోని సిఎస్ఐ స్కూల్లో డివిజన్ వ్యాప్తంగా అలింకో క్యాంప్ నిర్వహించారు. అర్హులైన వారికి ముందుగానే మెటీరియల్, లిస్టులు పంపించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రామిరెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు, ఎంపీపీ ఎస్‌పేట స్కూల్ హెచ్ఎం భాస్కర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు పిల్లలకు టీఎల్ఎం కిట్లు, హియరింగ్ ఎయిడ్‌లు, వీల్‌చైర్లు పంపిణీ చేశారు. అర్హులైన పిల్లలు, సంబంధిత సిబ్బంది పాల్గొన్న ఈ కార్యక్రమం సానుకూల వాతావరణంలో జరిగింది.

# బిజినెస్

## భారీ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

**-- సెన్సెక్స్ 1,695 పాయింట్లు పైకి..**

**--- ఒక్కరోజే 9.7 లక్షల కోట్ల సంపద పెంపు**



భారతీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలు చవిచూశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ ఏకంగా 1695 పాయింట్లు లాభపడింది. నిఫ్టీ కూడా అత్యధికంగా 461.30 పాయింట్లు పైకి ఎగసింది. ట్రేడింగ్ ఉదయం భారీ లాభాల్లో 74,709.27 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది.ఒక దశలో సెన్సెక్స్ 75,608.02 పాయింట్ల గరిష్టాన్ని తాకింది. చివరకు 1695.40 పాయింట్ల లాభంతో 75,527.95 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా రోజంతా లాభాల్లోనే కొనసాగింది. చివరకు 461.30 పాయింట్ల లాభంతో 23,622.90 పాయింట్ల వద్ద ముగిసింది. భారీ లాభాల కారణంగా స్టాక్ మార్కెట్ ఈ ఒక్కరోజే ఏకంగా రూ.9.7 లక్షల కోట్లు అర్జించింది. దీంతో భారత స్టాక్ మార్కెట్ విలువ రూ.452.33 లక్షల కోట్ల నుంచి రూ.462.05 లక్షల కోట్లకు పెరిగింది. సెన్సెక్స్ 20 సూచీలో బజాజ్ ఫైనాన్స్, ఎటర్నల్, ఇండిగో, ఎల్అండ్‌టీ, టైటాన్ షేర్లు లాభపడగా, టెక్ మహీంద్రా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గాయి. శుక్రవారం బ్రెంట్ బ్యారెల్ క్రూడాయిల్ ధర 86 డాలర్లుగా ఉంది. బంగారం ఔన్స్ ధర కూడా తగ్గి, 4224 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 95.11గా ఉంది. ఇరాన్, అమెరికా మధ్య ఉద్రిక్తతలు తగ్గడం, శాంతి ఒప్పందం కుదిరే అవకాశం ఉండటం, అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గడం మార్కెట్‌కు కలిసొచ్చింది.

## బంగారం, వెండి ధరలు. ఎలా ఉన్నాయంటే.



**ఇంటర్నెట్ డెస్క్:**
యూఎస్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మళ్లీ పతాకస్థాయికి చేరిన నేపథ్యంలో పసిడి ధరలు తగ్గుతున్నాయి. గత రెండు రోజులుగా ధరలు రికార్డు స్థాయిలో పతనమయ్యాయి. వెండి ధర కూడా ఓ మోస్తరు స్థాయిలో తగ్గింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, (జూన్ 12) ఉదయం 6.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,45,630 వద్ద కొనసాగింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,33,490గా ఉంది. కిలో వెండి రూ.2,59,900గా ఉంది. విజయవాడలో కూడా ధరలు దాదాపు ఇదే స్థాయిలో ఉన్నాయి. దేశంలోని ఇతర ప్రధాన నగరాల విషయానికి వస్తే చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,47,270గా ఉంది. 22 క్యారెట్ల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,34,990గా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,45,630గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,33,490గా ఉంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,780 వద్ద కొనసాగింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 1,33,640గా ఉంది. ఇక వివిధ నగరాల్లో కిలో వెండి ధర రూ.2.5 లక్షల నుంచి రూ.2.6 లక్షల మధ్య ఉంది. ఇరాన్‌తో డీల్ కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ప్రకటించడంతో బంగారం, వెండి ధరలు మళ్లీ పెరగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

**గమనిక:** బంగారం, వెండి ధరలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కాబట్టి కొనుగోలు చేసే ముందు ఒకసారి ధరలను చెక్ చేసుకోవలసిందిగా సూచన.

## ఒక్కసారి ఫుల్ చార్జి చేస్తే 39గంటలు నాన్‌స్టాప్ కాల్స్ మాట్లాడొచ్చు..

**- భారీ బ్యాటరీతో టెక్నో పోవా 8 లాంచ్!**

ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ టెక్నో తన కొత్త పోవా 8 స్మార్ట్‌ఫోన్‌ను భారత మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. గత ఏడాది వచ్చిన పోవా 7కు అప్‌గ్రేడెడ్ వెర్షన్‌గా తీసుకొచ్చిన ఈ మొబైల్ భారీ బ్యాటరీ, హై రిఫ్రెష్ రేట్ డిస్‌ప్ల, శక్తివంతమైన ప్రాసెసర్ వంటి ఫీచర్లతో స్మార్ట్‌ఫోన్ వినియోగదారులను ఆకట్టుకుంటుంది. భారత్‌లో పోవా 8 రెండు వేరియంట్లలో అందుబాటులోకి వచ్చింది. 6జీబీ ర్యామ్ం128జీబీ స్టోరేజ్ వేరియంట్ ధరను రూ.29,999గా నిర్ణయించారు. 8జీబీ ర్యామ్ం128జీబీ స్టోరేజ్ వేరియంట్ ధరను రూ.31,999గా ఖరారు చేశారు. ఈ మొబైల్ 16 బిట్ వైట్, ప్లాస్మా ఆరెంజ్, టెర్మినల్ గ్రీన్ రంగుల్లో అందుబాటులో ఉంది.



# స్పోర్ట్స్

## అంతర్జాతీయ క్రికెట్‌కు విలియమ్సన్ వీడ్కోలు..

**-ఎందుకీ షాకింగ్ నిర్ణయం..!**

న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. క్లాస్ ఆటతో ఫ్యాబ్-4లో ఒకడిగా పేరొందిన విలియమ్సన్ ఉన్నట్టుండి తన సుదీర్ఘ కెరీర్‌ను ముగిస్తున్నానని ప్రకటించాడు. తన సొగసైన ఆటతో, సమర్ధ నాయకత్వంతో కివీస్ క్రికెట్‌పై చెరగని ముద్ర వేసిన ఈ లెజెండరీ ఆటగాడు ఇంగ్లండ్ సిరీస్ మధ్యలోనే రిటైర్మెంట్ ప్రకటించడం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది.పదహారేళ్ల క్రితం అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన కేన్ విలియమ్సన్ హఠాత్తుగా వీడ్కోలు చెప్పేశాడు. ఇంగ్లండ్‌తో మూడు టెస్టుల సిరీస్ మధ్యలోనే ఈ దిగ్గజం నేను ఇక ఆడలేను అంటూ ఆటకు అల్విదా పలికాడు. లార్డ్స్ టెస్టులో ఆతిథ్య జట్టు చేతిలో ఘోర పరాభవంతో బాధ పడిన విలియమ్సన్ ఈ కఠిన నిర్ణయానికి వచ్చాడు.వీడ్కోలుపై నేను కొన్నిసార్లు ఆలోచించాను. అయితే.. గత కొన్ని రోజులుగా రిటైర్మెంట్ ఆలోచనలు నన్ను చుట్టుముట్టాయి. ఆటను వదిలేసేందుకు ఇదే సరైన సమయం అనిపించింది.



అంతర్జాతీయ క్రికెట్ ఆడేందుకు నేను ఎంతో ఆకలితో ఉండేవాడిని. న్యూజిలాండ్‌కు ఆడిన ప్రతి మ్యాచ్‌లో నా శక్తినంతా ధారపోసినందుకు చాలా గర్వంగా ఉంది. మునపటిలా ఆడలేనప్పుడు ఆటలో కొనసాగడం సరిగా అనిపించలేదు. స్వచ్ఛందంగా క్రికెట్‌కు వీడ్కోలు పలకడాన్ని అదృష్టంగా భావిస్తున్నా' అని విలియమ్సన్ వెల్లడించాడు.

**ప్రపంచ టెస్టు ఛాంపియన్**

ఫ్యాబ్ 4లో తన జోరు చూపించిన విలియమ్సన్.. విరాట్ కోహ్లీ, జో రూట్, స్టీవ్ స్మిత్‌లతో పోటీగా క్రేజ్ సంపాదించుకున్నాడు. 2021లో న్యూజిలాండ్‌ను ప్రపంచ టెస్టు ఛాంపియన్‌గా నిలిపాడు. అంతేనా.. 2019లో బ్లాక్ క్యాప్స్‌ను వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ చేర్చిన విలియమ్సన్.. అంపైర్ నిర్ణయంతో కప్ చేజారినా కోట్లాది మంది మనసులు గెలుచుకున్నాడు.నిరుడు నవంబర్‌లో అంతర్జాతీయ టీ20లకు గుడ్ బై చెప్పిన కేన్ మామ.. ఇప్పుడు తనకెంతో ఇష్టమైన టెస్టు, వన్డే ఫార్మాట్ల నుంచి కూడా వైదొలిగాడు. ఐపీఎల్‌లోనూ తనదైన శైలిలో మెరుపులు మెరిపించిన కేన్ మామ.. సన్ రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్‌కు ప్రాతినిథ్యాన్ని వహించాడు.


## దోహా డైమండ్ లీగ్‌కు నీరజ్ చోప్రా దూరం..!




పారిస్ ఒలింపిక్ విజేత నీరజ్ చోప్రా మరో మెగా ఈవెంట్‌కు దూరమయ్యాడు. గాయంతో బాధ పడుతున్న చోప్రా ప్రతిష్మాత్మక దోహా డైమండ్ లీగ్ నుంచి వైదొలిగాడు. వెన్ను గాయం నుంచి కోలుకుంటున్న అతడు జూన్ 19 నుంచి మొదలయ్యే మెగా ఈవెంట్‌లో పాల్గొనడం లేదు. దాంతో, నిరుడు ఇదే లీగ్‌లో 90 మీటర్ల దూరం ఈటెను విసిరిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్ ఆటను అభిమానులు మిస్ కానున్నారు.ఈ మధ్య కాలంలో గాయాల కారణంగా పలు టోర్నీలకు డుమ్మా కొడుతున్న నీరజ్ చోప్రా ఈటెను పట్టేందుకు మరింత సమయం పట్టనుంది. ప్రస్తుతం నీరజ్ వెన్నెముక గాయం నుంచి కోలుకుంటుండడమే అందుకు కారణం. ఫలితంగా జూన్ 19 నుంచి జరిగే దోహా డైమండ్ లీగ్‌కు చోప్రా దూరమయ్యాడు.త్వరలో జరుగబోయే కామన్‌వెల్త్ గేమ్స్, ఆసియా క్రీడలే లక్ష్యంగా పెట్టుకున్న నీరజ్.. సైకోథెరపిస్ట్ ఇషాన్ మర్వాహ, కోచ్ జై చౌదరీ సాయంతో స్విట్జర్‌లాండ్‌లోని బీయెన్నేలో 47 రోజుల శిక్షణ తీసుకుంటున్నాడు.

## విమానంలో క్రికెట్..
## కూతురికి సవాల్ విసిరిన సచిన్..!


క్రికెట్ గాడ్‌గా కోట్లాది మంది గుండెల్లో కొలువైన సచిన్ టెండూల్కర్ మరోసారి తన ఆటతో వైరలవుతున్నాడు. వరల్డ్‌కప్ ఛాంపియన్‌గా పదమూడేళ్ల క్రితమే వీడ్కోలు పలికిన సచిన్ తాజాగా విమానంలో క్రికెట్ ఆడుతున్న వీడియో నెట్టింటిని షేక్ చేస్తోంది. కుటుంబంతో కలిసి ప్రైవేట్ జెట్‌లో వెళ్తూనే.. తనకెంతో ఇష్టమైన, తన జీవితంలో భాగమైన క్రికెట్ ఆడుతూ మాస్టర్ బ్లాస్టర్ తెగ సంబురపడిపోయాడు.మైదానంలో రికార్డుల రారాజుగా కెరీర్ ముగించిన సచిన్ ఆటకు మాత్రం దూరమవ్వడం లేదు. వీలు చిక్కినప్పుడల్లా బ్యాట్ అందుకొని క్రికెట్ ఆడుతూ మురిసిపోయే టెండూల్కర్.. ఈసారి విమానాన్నే ఆట స్థలంగా మార్చేశాడు. కుటుంబంతో కలిసి వెయ్యి అడుగుల ఎత్తులో ప్రైవేట్ జెట్‌లో వెళ్తూనే.. తన మనసుకు నచ్చిన క్రికెట్ ఆడాడు. అంతేనా.. నువ్వు నన్ను ఔట్ చేయలేవు అంటూ కూతురు సారా టెండూల్కర్‌ను ఆట పట్టించాడీ దిగ్గజం. "ఎంత ఎత్తైనా సరే..



ఆటిట్యూడ్ మాత్రం మారదు" అనే క్యాప్షన్‌తో వీడియో పంచుకున్నాడు సచిన్.ప్రైవేట్ విమానం క్యాబిన్‌లో సచిన్ క్రికెట్ ఆడుతున్న వీడియోలో కోడలు సానియా చందోక్, కూతురు సారా ఉన్నారు. ఎరుపు బంతిని సానియా విసరగా.. సారా ఫీల్డింగ్ చేసింది. అయితే.. కూతురు క్యాచ్ అందుకునేందుకు ప్రయత్నించి విఫలమవ్వగా.. 'నువ్వు నన్ను ఔట్ చేయలేవు' అని సచిన్ సరదాగా అన్నాడు. ఒకప్పుడు మైదానంలో టన్నుల కొద్దీ పరుగులతో అభిమానులను అలరించిన సచిన్ ఆకాశవీధిలో.. బ్యాట్ పట్టుకొని కనిపించడంతో క్రికెట్ ఫ్యాన్స్ ఖుషీకి హద్దే లేదనుకో.




# నానీ మూవీలో రుక్మిణీ వసంత్




సప్త సాగరాలు దాటి', 'కాంతార 2' లాంటి విజయవంతమైన చిత్రాలతో దక్షిణాదిలోనే కాక ఉత్తరాదిలోనూ మంచి గుర్తింపు తెచ్చుకుంది నటి రుక్మిణీ వసంత్. ప్రస్తుతం ఆమె చేతుల్లో యశ్ 'టాక్సిక్', ఎన్టీఆర్ 'డ్రాగన్' లాంటి భారీ చిత్రాలున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడామె తెలుగులో మరో కొత్త కబురు వినిపించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. కథానాయకుడు నాని సొంత నిర్మాణ సంస్థ వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై నిర్మించనున్న ఓ కొత్త చిత్రం కోసం ఆమెను నాయికగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీన్ని 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ తెరకెక్కించనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయని.. ప్రధాన నటుడు ఖరారు కాగానే ఈ సినిమాని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉదని సమాచారం.

# పూరీ మార్క్...స్లమ్ డాగ్ టీజర్




డైరెక్టర్ పూరి జగన్నాథ్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ థ్రిల్లర్ 'స్లమ్‌డాగ్ -33 టెంపుల్ రోడ్' ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేసింది. ఇటీవలే విడుదలైన ఈ సినిమా టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ రాగా, తాజాగా చిత్రయూనిట్ ఈ టీజర్ వెనుక ఉన్న కష్టాన్ని, షూటింగ్ ఆసక్తికర విశేషాలను చూపిస్తూ ఒక పవర్‌ఫుల్ 'టీజర్ మేకింగ్ వీడియో'ను విడుదల చేసింది. ఈ మేకింగ్ వీడియోలో దర్శకుడు పూరి జగన్నాథ్ తనదైన మార్క్ స్టైల్‌లో సీన్లను ఎంత అద్భుతంగా డిజైన్ చేశారో స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా విజయ్ సేతుపతి ఒక యాచకుడి పాత్రలో విలక్షణమైన గెటప్, విభిన్నమైన డైలాగ్ డెలివరీ, మరియు యాక్షన్ సీక్వెన్స్ కోసం పడిన శ్రమ ఈ వీడియోలో ప్రధాన హైలైట్‌గా నిలిచింది. ఈ చిత్రం సమాజంలో మనం చూసే యాచకుల వెనుక ఉండే కొన్ని నిజమైన సంఘటనలు మరియు బలమైన ఎమోషన్స్ ఆధారంగా తెరకెక్కుతోందని పూరి జగన్నాథ్ వివరించారు. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ నటి టబు ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తుండగా, హీరోయిన్‌గా సంయుక్త.. కన్నడ నటుడు దునియా విజయ్ విలన్ రోల్‌లో కనిపించ బోతున్నారు.

# కిరణ్ అబ్బవరం కెఎ 13 సొంత బ్యానర్‌పై దర్శకత్వ బాధ్యతలు





యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం తన కెరీర్‌లో సరికొత్త అడుగు వేస్తూ, సరికొత్త ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న 13వ చిత్రానికి 'కెఎ13' అనే వర్కింగ్ టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమాకు సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ శనివారం నుంచి అధికారికంగా ప్రారంభం కాబోతున్నట్లు చిత్ర బృందం ఒక ఆసక్తికరమైన పోస్టర్ ద్వారా ప్రకటించింది. అయితే ఈ చిత్రానికి ఒక ప్రత్యేకత ఉంది. కిరణ్ అబ్బవరం కేవలం హీరోగానే కాకుండా, ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను కూడా స్వయంగా ఆయనే చేపట్టడం విశేషం. దర్శకుడిగా ఆయనకు ఇది సరికొత్త ప్రయాణం కానుంది. జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై సుధాకర్ చాగంటి ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఒక లాడ్జ్ లేదా హోటల్ రిసెప్షన్ డెస్క్‌పై ఉండే బెల్‌ను నొక్కుతున్నట్లుగా ఉన్న ఈ చిత్ర అనౌన్స్‌మెంట్ పోస్టర్ చూస్తుంటే, కిరణ్ అబ్బవరం ఈసారి ఒక విభిన్నమైన కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సస్పెన్స్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కి సంబంధించిన పూర్తి వివరాలు, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.



# ఆమె మాటలు మార్పుతెచ్చాయి

హీరోయిన్ల మధ్య వృత్తిపరమైన పోటీ సహజం. వ్యక్తిగతంగా కూడా వారిమధ్య ఈర్ష్యాద్వేషాలుంటాయని కొందరు అంటుంటారు. ఈ నేపథ్యంలోనే.. స్నేహబంధాలు కూడా తమలో బలంగా ఉంటాయని నిరూపించిన నాయికలు కూడా కొందరున్నారు. వారిలో అనుపమ పరమేశ్వరన్, సాయిపల్లవి ముందు వరుసలో ఉంటారు. మలయాళం సినిమా 'ప్రేమమ్'తో వీరిద్దరూ ఒకేసారి సక్సెస్ అందుకున్నారు. అప్పట్నుంచీ వీరి మధ్య బలమైన స్నేహబంధం ఏర్పడిందని చాలామందికి తెలీదు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో సాయిపల్లవితో తన అనుబంధాన్ని నెమరువేసుకున్నది అనుపమ పరమేశ్వరన్. 'తను నాకు ఫ్రెండ్ మాత్రమే కాదు. నా శ్రేయోభిలాషి కూడా.కోవిడ్ టైమ్‌లో సాయిపల్లవి మాటలు నాలో ఆత్మైస్థైర్యాన్ని నింపాయి. ఆ టైమ్‌లో అయినవారితో కమ్యూనికేషన్ తెగిపోయి తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురయ్యాను. ఆ క్లిష్ట పరిస్థితుల్లో సాయి నాకు అండగా నిలిచింది. నాలో ప్రశాంతత నింపేందుకు తనెంతో శ్రమించింది. 'మానసిక ఒత్తిడికి సృజనాత్మకతే మందు' అని తను చెప్పిన మాట నాలో ఎంతో మార్పును తెచ్చింది. నాకు పెయింటింగ్‌ని పరిచయం చేసింది. రంగులతో కాన్వాస్‌పై భావాలను పంచుకుంటూ మనసులోని భారాన్ని తగ్గించుకున్నాను. మనశ్శాంతి కోసం అలవరచుకున్న ఈ అలవాటు నాలో కొత్త నైపుణ్యాన్ని వెలికి తీసింది' అంటూ చెప్పుకొచ్చింది అనుపమ పరమేశ్వరన్.

# జైలర్-2లో గెస్ట్ పాత్రలో హృతిక్ ?



సూపర్‌స్టార్ రజినీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ డ్రామా 'జైలర్ 2'. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కి సంబంధించి ఒక అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. ఈ సినిమాలో మొదట బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ అతిథి పాత్రలో కనిపించబోతున్నాడని గతంలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ ఈ సినిమాలో ఒక పవర్‌ఫుల్ అండ్ ఇంటెన్స్ కామియో రోల్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. గతంలో రజినీకాంత్, హృతిక్ రోషన్ కలిసి నటించిన 'భగవాన్ దాదా' (1986) చిత్రం తర్వాత, దాదాపు 40 సంవత్సరాల అనంతరం వీరిద్దరూ కలిసి మళ్లీ ఒకే స్క్రీన్‌పై కనిపించబోతున్నారు. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్‌కి సంబంధించిన కొన్ని కీలకమైన సన్నివేశాలను జూన్ 22, 23 తేదీల్లో చెన్నైలో ప్రత్యేకంగా వేసిన సెట్స్‌లో భారీ ఎత్తున చిత్రీకరించనున్నట్లు ఇండస్ట్రీ టాక్. ఈ మైండ్ బ్లోయింగ్ క్రేజీ అప్‌డేట్ ఇటు సౌత్ ఇండస్ట్రీతో పాటు అటు నార్త్ ప్రేక్షకుల్లోనూ సినిమాపై ఉన్న అంచనాలను ఒక్కసారిగా స్కై హైకి తీసుకెళ్లింది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, ఎస్.జె.సూర్య, మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, సీనియర్ నటి రమ్యకృష్ణ, మిర్నా మీనన్, హాస్య నటుడు యోగి బాబు వంటి భారీ తారాగణం నటిస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తుండగా, ఈ ఏడాది చివర్లోనే ఈ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831